بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 9

సంచిక : 33

వార్షిక చందా 600/-రూ॥

www.akhbarbadrqadian.in

15 ఆగష్టు 2024 క్రీ, శ. 15 జహూర్ 1403 హి, శ. 08 సఫర్ 1446 హి,ఖ.


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

اِنَّ اللّٰہَ وَمَلٰٓئِکَتَہٗ یُصَلُّوۡنَ عَلَی النَّبِیِّ ؕ یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا صَلُّوۡا عَلَیۡہِ وَسَلِّمُوۡا تَسۡلِیۡمًا ﴿۵۷﴾

**అనువాదం:** అల్లాహ్, అతని దేవదూతలు నిశ్చయముగా సందేశహరుని పై దయానుగ్రహములు పంపుదురు. ఓ విశ్వాసులారా! మీరు కూడ అతనిపై దరూద్, సలాంలను తరుచుగా పంపుడు.

( అహ్జాబ్: 57)

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِكۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## ఒక వ్యక్తి నా సమాజంలో ఉన్నప్పటికి నా ఆకాంక్షకు అనుగుణముగా నడుచుకోక పోయినచో అతడు ఎండిపోయిన కొమ్మతో సమానం.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:**

నేను ఒక పుస్తకాన్ని తయారు చేయబోతున్నాను. అందులో తమ ఉద్రేకాలను అదుపు చేసుకోలేని వారందరిని వేరు చేయబోతున్నాను. చిన్న చిన్న విషయాలకే తగాద పడుతుంటారు. ఉదా॥ ఒక వ్యక్తి ఫలాన వ్యక్తి 10 గజాల దూరం దూకినాడు అని పలికినచో రెండవ వ్యక్తి ఆ విషయంపై వాదోపవాదాలు చేస్తుంటాడు. ఇలా కొనసాగినచో అసూయలు ఏర్పడుతాయి. ఈర్ష్య, ద్వేషాలను దూరం చేయడం కూడ మహ్ది సంకేతంలో ఒకటి. కావున ఆ సంకేతం పూర్తి గావించ బడదా?. తప్పకుండా పూర్తి గావించబడుతుంది. మీరు ఎందుకు సహనాన్ని పాటించడం లేదు. వైద్య వ్యవహారంను చూడండి. ఎప్పటి వరకైతే జబ్బును పూర్తిగ బాగుచేయడం కుదురదో అప్పటి వరకు రోగి బాగుపడడు. నా ద్వారా ఇన్షా అల్లాహ్ ఒక సంస్కారవంతమైన సమాజం ఏర్పాటు చేయబడుతుంది. పరస్పరం ద్వేషించుకోవడానికి గలకారణాలేమిటి?. లోభితనం, ప్రదర్శనకారితత్వం, స్వార్థం, ఇతర ఉద్రేకాలు. నేను ఇప్పుడే చెప్పాను. నేను త్వరలో ఒక పుస్తకాన్ని తయారు చేయబో తున్నాను. అందులో తమను తాము అదుపు చేసుకోలేని వారిని, పరస్పరం ప్రేమానురాగాలతో, సోదరభావంతో వ్యవహరించని వారిని ఈ సమాజం నుండి వేరుచేస్తాను. ఇలాంటి తత్వంగల వారు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, మీలో ఉన్నత సుగుణాలను ప్రదర్శించని వారు కొన్ని రోజుల అథితులు మాత్రమే. ఇతరుల కారణంగా నేను ఏ విధమైన ఆరోపణలను ఎదుర్కొవాలనుకోవడం లేదు. ఒక వ్యక్తి నా సమాజంలో ఉన్నప్పటికి నా ఆకాంక్షకు అనుగుణముగా నడుచుకోక పోయినచో అతడు ఎండిపోయిన కొమ్మతో సమానం. ఆ కొమ్మను తోటమాలి కొట్టివేయకుండా ఏమి చేస్తాడు?. ఎండిన కొమ్మ ఇతర పచ్చని కొమ్మలతో కలిసి నీటిని త్రాగుతుంది కాని, అది ఆ కొమ్మను పచ్చగా చేసుకోలేదు. పైగా ఆ కొమ్మ మరొక కొమ్మను ఎండగొడుతుంది. అందుకే భయపడుము. స్వయముగా తమను చికిత్స చేసుకోనివారు ఎవరు కూడ నాతో ఉండరు.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 458. ప్రచురణ 2018 ఖాదియాన్)

## కొంత మంది లోభితనం వలన తమ పిల్లలకు సరైన క్రమశిక్షణను నేర్పించరు. వారికి కావాలసిన సరైన ఆహారాన్ని సమకూర్చరు. లేదా పిల్లల పెరుగుదలకు కావాలసిన ఆహారాన్ని అందించరు.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్హు బనీ ఇస్రాయిల్‌కు చెందిన 32వ సూక్తి వలా తఖ్తులూ అవ్లాదకుం ఖషియత ఇమ్లాఖిన్ నహను నర్జుఖుహుం వ ఇయ్యాకుం ఇన్న ఖతలహుం కాన ఖిత్అన్ కబీరను విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు.

లా తఖ్తులూ అవ్లాదకుం ఖషియత ఇమ్లాఖ్ అనగా పిల్లలపై ధనమును ఖర్చు చేయవలసి వస్తుందనే భయంతో మీరు మీ పిల్లలను చంపుకోకండి. ఈ ఆదేశం కేవలం బాలికలను హతమార్చుతారని ఉద్దేశంతో చేసినది కాదు. ఎందుకనగా ఖుర్ఆన్ కరీం ఎక్కడ కూడ ధనమును ఖర్చుచేయు భయంతో ప్రజలు బాలికలను హతమార్చు తున్నారు అని పేర్కొనలేదు. బాలికలు జన్మించడంను తమ అవమానంగా భావించి హతమార్చు తారు అని మాత్రమే పేర్కొన్నది. అదే విధముగా పేదరికం వలన గాని, పోషించలేని స్థితి వలన గాని పిల్లలను హతమార్చడం అని కూడ ఈ సూక్తి ఏమాత్రం అర్థం కాదు.

ఎందుకనగా ఇమ్లాఖ్ అనే పదానికి పేదరికం, నిస్సహాస్థితి అనే అర్థాలే లేవు. కేవలం ధనమును ఖర్చు చేయడం మాత్రమే దాని అర్థం. కావున ఈ సూక్తి అర్థమేమనగా సిరిసంపదలను నాశనం చేస్తున్నాడనే భయంతో పిల్లలను హత మార్చకుము.

తమ సంపద తరిగిపోకూడదని కూడ ఎవరైన తమ పిల్లలను హతమార్చు కుంటారా?అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది.

ఈ క్రమంలో మనం ప్రపంచాన్ని చూసినచో ఇలాంటి ఘటనలు, సంఘటనలు ప్రజల మదిలో ఎక్కడ కదలాడినట్లుగా కనిపించవు. పైగా ధనము లేని వారు కూడ తమ పిల్లలను చంపుకోవడం మనకు ఎక్కడ కనిపించదు. కావున ఈ సూక్తి యొక్క భావం మరొకటై ఉండాలి. అందుకే మానవులమైన మనం ఆ నేరాన్ని గూర్చి అన్వేషించాలని అర్థమవుతుంది. ఈ క్రమంలో మనం వివిధ స్వభావాలు కల్గిన మానవులను పరిశీలించి చూసినచో మనకు తెలియునదేమనగా కొంత మంది లోభితనం వలన తమ పిల్లలకు సరైన క్రమశిక్షణను నేర్పించరు. వారికి కావాలసిన సరైన ఆహారాన్ని సమకూర్చరు. లేదా పిల్లల పెరుగుదలకు కావాలసిన ఆహారాన్ని అందించరు. తెలివి తక్కువ వారిలోనే ఇలాంటి పిసినారులు ఎక్కువగా ఉంటారు. వారిపై ఎక్కడ ధనమును ఖర్చుచేయవలసి వస్తుందో అనే భయంతో విషంతో గాని లేదా గొంతునలిపి గాని తమ పిల్లలను చంపుకుంటారు. ఇలాంటి పిసినారులు సాధారణ ప్రజానీకంలో మనకు ఎక్కువగానే కనిపిస్తుంటారు. అనగా వారి వద్ద ధనము ఉన్నప్పటికి వారి పిల్లలకు సరైన పోషక ఆహారాన్ని సమకూర్చలేరు.

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

హజ్రత్ హుజైఫా రజియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా నేను ఇలా విన్నాను. హుజూర్ (స) ఇలా తెలిపారు. "ఒక వ్యక్తి మరణించాడు. నీవు ఏమి చేసేవాడివి? అని అతడిని ప్రశ్నించడం జరిగింది. అందుకు అతడు నేను ప్రజలతో వ్యాపారం చేసేవాడిని. ధనవంతులకు అవకాశాన్ని కల్పించే వాడిని. పేదవారిని క్షమించేవాడిని అని సమాధానం ఇచ్చాడు.

హజ్రత్ అబూ మసూద్ రజియల్లాహ్ అన్హు ఇలా తెలిపారు. నేను కూడ ఆ కథనాన్ని (హదీస్‌ను ) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా విన్నాను.

హజ్రత్ అబూహురైరహ్ రజియాల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. ఒక వ్యక్తి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని తన ఒంటెను కొనుగోలు చేయుమని విన్నవించుకున్నాడు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని ఒంటెను కొనుగోలు చేయుమని ఆదేశించారు. అప్పుడు అనుచరులు మనకు అతని ఒంటె కంటే ఉమర్ యొక్క ఒంటె చాలా తక్కువ ధరకు లభిస్తుంది అని విన్నవించు కున్నారు. అందుకు ఆ వ్యక్తి హుజూర్ (స)తో "హుజూర్ (స) మీరు నాకు అధిక ధర ను చెల్లించినచో అల్లాహ్ కూడ మీకు అధిక సంపదను అందించును" అని అన్నాడు. అందుకు హుజూర్ (స) అతనికి ఆ మొత్తాన్నే చెల్లించండి. ఎందుకనగా ఉత్తమముగా వ్యవహరించు వారే ఉత్తములు అనబడుతారు అని తెలిపారు.

హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజి ఇలా ఉల్లేఖించారు:రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖానా కాబా చుట్టు ప్రదక్షణలు చేశారు. ఆ సమయంలో హుజూర్ (స) ఒంటెపై కూర్చొని ఉన్నారు. హుజూర్ (స) హజరే అస్వద్ వద్దకు వచ్చిన ప్రతి సారి తమ చేతిలో ఉన్నటు వంటి ఒక వస్తువును దానివైపు చూపుతూ అల్లాహ్ అక్బర్ అని పలికేవారు.


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

అల్లాహ్ తాలా ఈ సూక్తిని ఉపవాసపు ఆదేశాలతో కలిపినాడు. మరొక విధముగా చెప్పదలచినచో ఆయా ఆదేశాల మధ్యలో చేర్చినాడు. దీని ద్వారా దుఆలకు రమజాన్ మరియు ఉపవాసాలతో చాలా ప్రత్యేక సంబంధము ఉన్నదని తెలుస్తుంది. రమజాన్ మరియు దుఆలకు విడదీయరాని అనుబంధము ఉన్నదనే విషయాన్ని ప్రతి ముసల్మానుడికి చాలా బాగా తెలుసు.

నా ఉనికిని నిరూపించడానికి ఏమి ఉంది మరియు వారు నన్ను ఎందుకు విశ్వసించాలి? అని నా సేవకులు మిమ్మల్ని అడిగితే, నేను చాలా దగ్గరగా ఉన్నానని వారికి చెప్పండి. నన్ను పిలిచే ఎవరికైనా నేను సమాధానం ఇస్తాను, నేను అతని పిలుపును వింటాను మరియు నేను అతనితో మాట్లాడుతాను. వారి వంతుగా, నా సేవకులు తమను తాము నా సంభాషణకు అర్హులుగా తీర్చిదిద్దుకోవలెను మరియు నాపై సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండవలెను.'

అలా దూరంగా నిలబడి ప్రయోజనం లేదన్నది మొదటి అంశం. దగ్గరికి రండి, ప్రేమ ద్వారా సామీప్యత లభిస్తుంది. మీ హృదయంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రేమను సృష్టించుకోండి. మీ చెవులలోనే లోపం ఉన్నది. ఈ ఉదాహరణలో వారి చెవులలో లోపాలు ఉన్నట్లు అనగా విశ్వాసం యొక్క బలహీనత అని అర్థం. ఈ విశ్వాసం యొక్క ఈ బలహీనతను తొలగించి, మీ విశ్వాసాన్ని బలోపేతం చేయండి, అప్పుడు మీరు అతని సామీప్యాన్ని పొందుతారు

నిరంతరం దుఆ చేస్తుండాలి మరియు ఆ స్థితిని అభివృద్ధి చేసే వరకు అల్లాహ్ సన్నిధిని వదలకూడదు. అప్పుడే భగవంతుని ఆశీస్సులు రావడం ప్రారంభమవుతుంది.

“దుఆ అనేది ప్రతి కష్టాన్ని తేలికగా మారుస్తుంది. ఎవరైనా ప్రార్థిస్తే, చాలా కష్టమైన పని కూడా సులభం అవుతుంది. ప్రార్థన విలువ మరియు శక్తిని గురించి ప్రజలకు తెలియదు. మరల ఇలా తెలిపారు. “దుఆ యొక్క విలువ మరియు శక్తిని గురించి తెలియని వ్యక్తులు సులభంగా నిరుత్సాహానికి గురవుతారు మరియు ఆశను కోల్పోతారు, అయితే దుఆకు పట్టుదల మరియు నిరంతర ప్రయత్నం అవసరం.

ఎవరైనా చనిపోతారని వైద్యులు చెబితే, ప్రార్థనల కారణంగా అతనికి మరో **9** సంవత్సరాలు, **4** సంవత్సరాలు లేదా **10** సంవత్సరాల జీవితం మంజూరు చేయబడుతుంది, అప్పుడు ఆ వ్యక్తి యొక్క విధిని మార్చినది సర్వశక్తిమంతుడైన అల్లాహ్. వాస్తవానికి, ప్రతి ఒక్కరూ చనిపోతారు కానీ సర్వశక్తిమంతుడైన అల్లా ఒకరి జీవితాన్ని పొడిగించగలడు మరియు వారికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించగలడు.

రంజాన్ నెలలో, జమాత్ పురోగతి కోసం ప్రత్యేకంగా ప్రార్థించండి. అల్లాహ్ మార్గంలో ఖైదు చేయబడిన వారి కోసం ప్రార్థించండి, అల్లా వారి విడుదలకు త్వరగా మార్గాలను సమకూర్చుగాకా!. యెమెన్‌లో ఖైదు చేయబడిన వారి కోసం ప్రార్థించండి.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 29 మార్చి 2024, (29 అమాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

**వ ఇజా సఅలక ఇబాది అన్ని ఫ ఇన్ని ఖరీబున్ ఉజీబు దఅవత ద్దాఇ ఇజా దఆని ఫల్ యస్తజీబూ లీ వల్ యూమినూ బి లఅల్లహుం యర్షుదూన్**

“ నన్ను గూర్చి నా దాసులు నిన్ను ప్రశ్నించునప్పుడు నిశ్చయముగా నేను సమీపంలోనే ఉన్నాను, నన్ను పిలుచుచు ప్రార్థించు వారి ప్రార్థనకు నేను సమాధానము ఇచ్చెదను. కనుక వారు సన్మార్గమును అవలంభించుటకు సావధానులై నా ఆదేశమును వినవలయును, నా యందు విశ్వాసముంచ వలయును. **(బఖర:187)**

అల్లాహ్ తాలా ఈ సూక్తిని ఉపవాసపు ఆదేశాలతో కలిపినాడు. మరొక విధముగా చెప్పదలచినచో ఆయా ఆదేశాల మధ్యలో చేర్చినాడు. దీని ద్వారా దుఆలకు రమజాన్ మరియు ఉపవాసాలతో చాలా ప్రత్యేక సంబంధము ఉన్నదని తెలుస్తుంది. రమజాన్ మరియు దుఆలకు విడదీయరాని అనుబంధము ఉన్నదనే విషయాన్ని ప్రతి ముసల్మానుడికి చాలా బాగా తెలుసు. అందుకే రమజాన్‌లో ప్రత్యేకించి నమాజ్‌లను, నవాఫిల్‌ను, తహాజ్జుద్‌ను , తరహ్‌వీ వంటి ప్రార్థనల వైపు ప్రత్యేక శ్రద్ధను కనబర్చుతాడు. ఈ రోజులలో అల్లాహ్ యొక్క ప్రత్యేక ప్రేమాభిమానం అతని దాసులపై కురుస్తుందనే వాస్తవం ప్రతి సత్యమైన ముసల్మానుడికి తెలుసు. సాధారణ రోజులలో కూడ అల్లాహ్ తాలా తన దాసులపై ప్రేమపూర్వకమైన దృష్టిని కేంద్రీకరిస్తాడు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: “ నేను నా దాసుని ఆలోచనల ప్రకారంగానే అతని పట్ల వ్యవహరిస్తాను. అతడు నన్ను గుర్తుచేసుకున్న సమయంలో నేను అతనికి తోడుగా ఉంటాను. ఒకవేళ అతడు తన మనస్సులో నన్ను గుర్తుచేసుకున్నచో నేను అతనిని నా మనస్సులో గుర్తు చేసుకుంటాను. ఒకవేళ అతడు ఏదేని సమూహంలో నన్ను గూర్చి ప్రస్తావించినచో నేను కూడ అతనిని గూర్చి సమూహంలో ప్రస్తావించెదను. ఒకవేళ అతడు నావైపు ఒక్క జానెడు దూరం వచ్చినా నేను అతని వైపు ఒక చేతి దూరం వచ్చెదను, ఒకవేళ అతడు నా వైపు ఒకచేతి దూరం వచ్చినచో నేను అతని వైపు రెండు చేతుల దూరం వరకు వచ్చెదను. ఒకవేళ అతడు నా వైపు నడుచుకుంటూ వచ్చినచో నేను అతని వైపు పరుగెత్తుకుంటూ వచ్చెదను అని అల్లాహ్ తెల్పినాడు. ” **(సహి బుఖారి, కితాబుత్తౌహిద్, బాబ్ మా యజ్‌కురు ఫి జాతి వ్వ నౌఅతు..... హదీస్ 7405)**

అల్లాహ్ తాలా సాధారణ రోజులలో కూడ తన దాసుని పట్ల పై విధముగా వ్యవహరిస్తాడు. మరి రమజాన్ మాసం వచ్చినప్పుడు, అది కూడ ప్రత్యేకించి అల్లాహు వైపు ముందుకు సాగునట్టి మాసం, మొత్తం పరిసరాలు కూడ మానవున్ని అల్లాహును గుర్తుచేసుకోనుట వైపు శ్రద్ధచూపుతాయి. అలాంటప్పుడు అల్లాహ్ తాలా ఎంతగా కరుణిస్తాడో!, అట్టి కరుణను మనం అంచనా కూడ వేయలేము. ఇందుకు నిబంధన ఏమిటనగా ఈ అడుగులన్నియు మనస్ఫూర్తిగా వేయవలెను. విశ్వాస పటిష్టతతో వేయవలెను. అంతేగాని నామ మాత్రముగా మాత్రం కాదు.

మరల అల్లాహ్ తాలా తన దాసునిపై ఎంతగా కరుణిస్తాడో అందుకు సంబంధించిన ఒక ఉదాహరణను తెల్పుచూ ఒకానొక సందర్భమున ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా చాలా అభిమానం గలవాడు. చాలా దయగలవాడు, కరుణించువాడు. తన దాసుడు రెండు చేతులను ఎత్తి (అతనిని యాచించినచో) అతడు వారిని ఖాళి చేతులతో, నిరాశతో వెనుకకు పంపుటను అవమానంగా భావిస్తాడు.

స్వచ్ఛమైన నిండు మనస్సుతో యాచించిన దుఆలను అతడు రద్దు చేయడు.

ఆమోదిస్తాడు. (సునన్ అబూ దావూద్, బాబ్ తఫ్రీఉ అబ్వాబుల్ వితర్, బాబుద్దుఆ హదీస్ 1488) కావున చేతులు ఎత్తిదుఆ చేసినప్పుడే ఆమోదించబడు స్థితి ఏర్పడుతుంది. స్వచ్ఛమైన మనస్సుతో దుఆ చేయవలెను. ఇందుకు తప్పకుండా గత పాపముల నుండి తనను తాను పూర్తిగా కాపాడుకుంటూ, నిజమైన పాశ్చాత్తాపపు వాగ్దానంతో అల్లాహ్ తాలా వైపు అడుగులు వేయవలెను. అప్పుడే స్వచ్ఛమైన మనస్సుతో దుఆ వెలువడుతుంది. మేము దుఆ చేశాము కాని, అది ఆమోదించ బడలేదని మనం కొన్ని సార్లు తొందరపాటుతో అంటాము. వాస్తవానికి మన మనస్సు ఎంత స్వచ్ఛముగా ఉన్నది?, ఎంతటి నిజాయితీతో మనం అల్లాహ్ ప్రేమను మనలో పెంచుకుంటున్నాము?, ఎంతటి నిజాయితీతో మనం గత పాపముల నుండి క్షమాపణలు కోరుకుంటున్నాము?, మనం ఏ స్థాయి మేరకు భవిష్య పాపముల నుండి కాపాడుకొనుటకు మరియు అల్లాహ్ తాలా తెల్పిన మార్గములను అనుసరించుటకు ప్రయత్నము చేస్తున్నాము? అని మాత్రం చూసుకోవడం లేదు.

అల్లాహ్ తాలాను మోసం చేయలేము. అతనికి మన ఆంతర్యమును గూర్చి బాగా తెలుసు. మన పాతళం వరకు కూడ అతనికి తెలుసు.

కావున అల్లాహ్ తాలా అనుగ్రహాలను పొందడం కోసం, అతని గృహములోకి ప్రవేశించడం కోసం అతని విధివిధానాలను పూర్తి చేయవలసి ఉంటుంది. తన దాసులపై అల్లాహ్ తాలా ఎంతటి ప్రేమాభిమానాలను కురిపించుతాడనగా, ప్రతి సంవత్సరం ప్రత్యేకించి రమజాన్ మాసంలోకి మనలను తీసుకవచ్చి, సాధారణ రోజులలో తప్పిదాలను, పొరపాట్లు జరిగినచో ఈ మాసపు శుభములతో ప్రయోజనంను పొందుతూ నా వైపు రమ్ము, నా దాసులలో చేరిపొమ్ము అని అవకాశాన్ని కల్పిస్తున్నాడు. అల్లాహ్ తాలా ప్రత్యేకించి ఈ రోజులలో తన దాసులపై ప్రేమను కురిపిస్తాడు. దారి తప్పినవారిని, దారి మర్చినవారిని సన్మార్గంలో నడిపిస్తాడు. ప్రత్యేక పరిస్థితులు నెలకొనడం వలన దాసుల ప్రార్థనల ప్రామాణికాలు కూడ శిఖర స్థాయికి చేర్చాలనుకుంటాడు.

ఈ సూక్తిలో అల్లాహ్ తాలా " నా దాసులు " అని పిలిచాడు. కావున ఇక్కడ దాసులు అనగా నిజముగా అల్లాహ్ తాలా భక్తులుగా మారాలనుకునేవారు, నిజమైన ప్రాయాశ్చిత్తం చేసుకునేవారు, చేయాలనుకునేవారు.

కావున ఇలాంటి స్వచ్ఛమైన దాసులుగా మారుటకు మనం ప్రయత్నించవలెను. రమజాన్ మాసంలో అతని సాన్నిహిత్యంను పొందుటకు, అతని నిజమైన దాసులుగా మారుటకు ప్రత్యేక పరిస్థితులు నెలకొంటాయి. అల్లాహ్ తాలా అభిమానంను మనం పెంచుకోవడానికి ప్రయత్నించినప్పుడే అతని నిజమైన దాసులుగా మారగలము. ఇలాంటి స్థితి ఏర్పడినప్పుడే " ఇలాంటి నా దాసులకు మరియు నన్ను ప్రేమించే వారికి, నేను వారి దుఆలను ఆలకిస్తాను మరియు వారికి సమాధానంను ఇస్తాను అని తెల్పుము " అని అల్లాహ్ తాలా అంటున్నాడు.

కాబట్టి, మన ప్రార్థనలు మన వ్యక్తిగత ప్రయోజనం కోసమే పరిమితం కాకూడదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సామీప్యాన్ని పొందడం మరియు అతని ప్రేమను పొందడం కోసమై ఉండాలి. భగవంతుని ప్రేమను పొందడం కోసం మనం అతని వైపు ఒక చేయి దూరం ముందుకు వెళ్ళిన మరియు మనం అతని వైపు వేగంగా నడిచినట్లయితే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనవైపు అంతకన్న రెట్టింపు వేగంతో మనవైపు వస్తాడు. మనకు సహాయం చేయడానికి పరుగెత్తుకొని కూడ వస్తాడు. ఆయన మన ప్రార్థనలకు జవాబిస్తాడు. అయితే, కేవలం మౌఖిక ప్రేమ వాదనలు మీకు ఈ స్థాయిని కల్పించవని సర్వశక్తిమంతుడైన అల్లా స్పష్టంగా పేర్కొన్నాడు. అందుకు మీరు నా సూచనలను అనుసరించాలి, నా ఆజ్ఞల ప్రకారం నడుచుకోవాలి, దేవునికి ఇవ్వాల్సిన హక్కులు మరియు అతని దాసులకు సంబంధించిన హక్కులను నెరవేర్చాలి, ఆపై మీ విశ్వాసాన్ని బలోపేతం చేసుకోవాలి – ఎన్నడు చలించని పటిష్టమైన విశ్వాసంను ఏర్పర్చుకోవాలి. ఇలా సాధ్యమైనప్పుడు మాత్రమే మీరు నా నిజమైన సేవకులలో లెక్కించబడతారు. ఇప్పుడు, తాము చాలా ప్రార్థనలు చేసాము, అనేక సాష్టాంగ నమాజులు చేసాము మరియు అనేక స్వచ్ఛంద ప్రార్థనలు చేసాము, అయినప్పటికీ తమ లక్ష్యం నెరవేరలేదు అని చెప్పుకునే వారు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞలను నిజంగా అమలు చేసారో లేదో తెలుసుకోవడానికి తమను తాము విశ్లేషించుకోవాలి. ఏ తుఫాను వారిని కదిలించలేని స్థాయికి వారు తమ విశ్వాస ప్రమాణాన్ని పెంచారా?, ఎక్కువ మంది ప్రజల స్థితి ఏమిటంటే, వారు తమ ప్రియమైన అల్లాహ్ ఇష్టాన్ని నెరవేర్చడానికి బదులుగా, వారు తమ అవసరాల జాబితాలను దేవుని ముందు విన్నవిస్తుంటారు మరియు సర్వశక్తిమంతుడైన అల్లా ఈ ప్రార్థనలను అంగీకరించకపోతే ప్రార్థన చేయడం వల్ల ప్రయోజనం లేదని చెబుతారు.

అప్పుడు వారు దేవుని ఉనికిని, ప్రార్థన వెనుక ఉన్న జ్ఞానం మరియు దాని అంగీకారాన్ని పూర్తిగా ప్రశ్నించడం ప్రారంభిస్తారు. ఇవి అల్లాహ్ సేవకుల లక్షణాలు కాదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఖాళీ చేతులతో విడిచిపెట్టడానికి ఇష్టపడని వారి లక్షణాలు కాదు. కాబట్టి, దేవుని అస్తిత్వను ప్రశ్నించే ముందు, వారు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆదేశాలను ఏ మేరకు అనుసరిస్తున్నారో మరియు వాటిపై ఏ మేరకు వ్యవహరిస్తున్నారో మరియు వారు తమ విశ్వాసాన్ని ఏ మేరకు బలపరుచు కుంటున్నారో తమను తాము విశ్లేషించుకోవాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ అంశంను గూర్చి తన అనేక పుస్తకాలలో ఈ విధముగా రాశారు. దుఆ వెనుక ఉన్న పరిజ్ఞానం మరియు దుఆ అంగీకరించడం వెనుక ఉన్న విజ్ఞానం మరియు తత్వం గురించి హుజూర్ (అ) చాలా వివరంగా వ్రాసారు. మరియు ప్రార్థనను నిజమైన ప్రార్థనగా పరిగణించగల ప్రమాణాలను వివరించారు. దీని దృష్ట్యా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క నిజమైన సేవకులు ఎవరు అనే విషయంలో నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కొన్ని ఉల్లేఖనాలను చదివి వినిపిస్తాను.

హుజూర్ (అ) ఇలా తెలిపారు. "నా సేవకులు నా గురించి మరియు నా ఉనికికి రుజువులు ఏమిటి అని అడిగినప్పుడు, నేను చాలా సమీపంలో ఉన్నాను, అంటే గొప్ప రుజువుల అవసరం లేదు అని సర్వశక్తిమంతుడైన అల్లా పేర్కొన్నాడు. నా ఉనికిని చాలా దగ్గరగా అర్థం చేసుకోవచ్చు మరియు నా ఉనికిని చాలా సులభంగా నిరూపించవచ్చు. దీనికి సాక్ష్యం ఏమిటంటే, ఒక వ్యక్తి నన్ను పిలిచినప్పుడు, నేను వారి ప్రార్థనను వింటాను మరియు వారి విజయానికి సంబంధించిన శుభవార్తలను వెల్లడిస్తాను, తద్వారా నా ఉనికి వారికి నిరూపించబడడమే కాకుండా, వారు నేను సర్వశక్తిమంతుడు అని నిశ్చయించుకుంటారు. అయితే ప్రజలు అలాంటి ప్రామాణికమును మరియు దేవుని పట్ల భయాన్ని పెంచుకోవాలి, తద్వారా నేను వారి పిలుపులను వినవచ్చు." ఇది చాలా ముఖ్యమైన స్థితి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ చెబుతున్నాడు నేను వింటాను, అయితే మొదట, ఒక వ్యక్తి ధార్మికతను మరియు దేవుని పట్ల భయాన్ని పెంచుకోవాలి. అప్పుడే అల్లాహ్ వారి పిలుపులను వింటాడు. హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు."అందుకే, మీరు నన్ను విశ్వసించాలి, మరియు మీరు పరిపూర్ణమైన అవగాహన పొందే ముందు, దేవుడు ఉన్నాడని మరియు అన్ని శక్తులను మరియు అధికారాలను కలిగి ఉన్నాడని ప్రకటించండి." సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ముందు, ప్రార్థనను అంగీకరించబడడం ద్వారా అతని సంకేతాలకు సాక్ష్యం లభించడానికి ముందు దేవుడు ఉన్నాడనే నమ్మకం మరియు విశ్వాసాన్ని కలిగి ఉండాలి. ముందుగా భగవంతునిపై మీ విశ్వాసాన్ని బలపరచుకోండి, కనిపించని వాటిపై విశ్వాసం కలిగి ఉండండి మరియు ఆయన సర్వశక్తిని కలిగి ఉన్నాడని. "నమ్మిన వ్యక్తికి దైవిక జ్ఞానం ఇవ్వబడుతుంది." (అయ్యాము స్సులహ్ రూహాని ఖజాయిన్ సంపుటి14, పేజీలు. 260-261)

మొదట విశ్వాసాన్ని కలిగి ఉండాలి, తరువాత వారికి దైవిక జ్ఞానం ఇవ్వబడుతుంది. ఒకరు ఉన్నత స్థాయి విశ్వాసాన్ని కలిగి ఉన్నప్పుడు మాత్రమే వారి ప్రార్థనలను అంగీకరించబడు దృశ్యాలను వీక్షిస్తుంటారు. అంతేగాని ఏదేని సమస్య ఎదురుకాగానే మానవుడు బలహీన విశ్వాసాన్ని చూపించకూడదు. "సర్వశక్తిమంతుడైన అల్లా ప్రార్థనలకు సమాధానమిస్తాడని తన ఉనికికి రుజువు ఇచ్చాడు. కాబట్టి, ఒక ప్రార్థన అంగీకరించబడకపోతే, ఇద్దరు స్నేహితుల సంబంధాల మధ్య లోటుపాట్లు ఉన్నట్లే, ఈ సంబంధంలో కూడా లోపం ఉంటుంది. ఈ లోపాన్ని సరిదిద్దే పద్ధతిని కూడా అతను మనకు నేర్పించాడు, అంటే ధార్మికతను అభివృద్ధి చేసుకోవడం, పూర్తి దృఢ నిశ్చయంతో దేవుడు నిజంగా ఉన్నాడని ప్రకటించడం. అతని ఉనికిని మరియు కనిపించని వాటిని విశ్వసించడం మరియు మూడవది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అన్ని శక్తులు మరియు అధికారాలను కలిగి ఉన్నాడని మరియు అన్ని శక్తులు కలిగి ఉన్న వ్యక్తి మరొకరు లేడని పూర్తి నమ్మకంను కలిగి ఉండాలి. కాబట్టి, దుఆ యొక్క అంగీకారానికి ఇది కనీస ప్రమాణం.

మరల ఇలా తెలిపారు. "నా ఉనికిని నిరూపించడానికి ఏమి ఉంది మరియు వారు నన్ను ఎందుకు విశ్వసించాలి? అని నా సేవకులు మిమ్మల్ని అడిగితే, నేను చాలా దగ్గరగా ఉన్నానని వారికి చెప్పండి. నన్ను పిలిచే ఎవరికైనా నేను సమాధానం ఇస్తాను, నేను అతని పిలుపును వింటాను మరియు నేను అతనితో మాట్లాడుతాను. వారి వంతుగా, నా సేవకులు తమను తాము నా సంభాషణకు అర్హులుగా తీర్చిదిద్దుకోవలెను మరియు నాపై సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండవలెను." అంటే, దేవునితో సంభాషించగలిగేలా తమను తాము సంస్కరించుకోవాలి. (లెక్చర్ లాహోర్, రూహాని ఖజాయిన్ సంపుటి 20, పేజి 159) అప్పుడే మార్గదర్శకం లభిస్తుంది.

కాబట్టి, ఒక వ్యక్తి పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉండాలి మరియు నేను

చెప్పిన విధముగా, ఆయా షరతుల పరంగా తప్పకుండా నడుచుకోవాలి. ముందే తెలుపబడినవి. నేను ఇంతకు ముందే తెలిపాను. మొదటిది, ధార్మికతను పెంపొందించుకోవడం మరియు దేవుని పట్ల భయాన్ని కలిగి ఉండటం. రెండవది, దేవుడు ఉన్నాడని పూర్తి విశ్వాసం కలిగి ఉండటం. అనుభవం ఉన్నా లేకపోయినా కనిపించనివాటిని విశ్వసించడం, దేవుడున్నాడని పరిపూర్ణమైన నమ్మకం కలిగి ఉండాలి. మూడవది, అతను సర్వశక్తివంతుడని మరియు సర్వాధికారాన్ని కలిగి ఉన్నాడని పూర్తి నమ్మకం కలిగి ఉండటం. ఏదైనా పని జరగకపోతే, అలా చేసే శక్తి అతనికి లేదని చెప్పి, అతనిని అనుమానించడం ప్రారంభించకూడదు. బదులుగా, అతడే సర్వశక్తివంతుడు మరియు సర్వాధికారాలను కలిగి ఉన్నాడని నిశ్చయత కలిగి ఉండాలి.

కాబట్టి, దుఆలను అంగీకారం పొందకపోవడం వలన నిరాశ చెందేవారు మరియు సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికిని అనుమానించే వారు ముందుగా వారు ఆ మూడు షరతులను పాటిస్తున్నారో? లేదో? అని తమను తాము విశ్లేషించుకోవాలి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనను వారు వాటిపై స్థిరంగా ఉన్నారో లేదో పరీక్షించుకోవాలి. ఈ విశ్వాస ప్రమాణాన్ని కలిగి ఉండటం మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఉనికిని అనుమానించడం అనేది ఒకే సమయంలో ఎవరికీ సాధ్యం కాదు.

మరొక హుజూర్ (అ) ఇలా తెలిపారు. వ ఇజా సాఅలక ఇబాది అన్నీ ఫ ఇన్నీ ఖరీబున్ (బఖరహ్:187) దీని అర్థం అంటే ఎవరైనా దేవుని ఉనికిని ప్రశ్నిస్తే, ఇస్లాం దేవుడు చాలా దగ్గరలో ఉన్నాడని సమాధానం. ఎవరైనా ఆయనను నిండుమనస్సుతో పిలిచినట్లయితే, అతను వారికి సమాధానం ఇస్తాడు. ఇతర మతాల దేవతలు సమీపంలో లేరు" అనగా ఇతర విశ్వాసాలు, " ఎంతగా దూరంలో ఉన్నారనగా వారిని గుర్చి తెలుసుకోవడం కూడ అసాధ్యం. ఆరాధకుని మరియు భక్తుని యొక్క ఉన్నతమైన లక్ష్యం ఆయన దగ్గరికి చేరుకోవడమే, అలా చేయడానికి ఇదే సాధనం." నిజమైన ఆరాధకుడి యొక్క అత్యున్నత ఉద్దేశ్యం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందడం మరియు తమ హృదయాలలో అల్లాహ్ పట్ల ప్రేమను పెంపొందించడం, "దీని ద్వారా వారు అతని ఉనికిపై పూర్తి విశ్వాసాన్ని పొందగలరు. ఉజీబూ దఅవత ద్దాఇ ఇజా ద ఆని (బఖరహ్: 187) దీని అర్థమేమనగా, అతను సమాధానం చెబుతాడు , అతడు మూగవాడు కాదు. ఈ ఋజువు ముందు మిగిలిన అన్ని రుజువులు చాలా తక్కువ స్థాయిని కల్గియున్నవే. దైవిక సంభాషణ అనేది వాస్తవానికి అల్లాహ్ ఉనికికి సాక్ష్యాలుగా పరిగణించ బడుతుంది." (మాల్ఫుజాత్, సంపుటి 7, పేజ 107, ఎడిషన్ 1984) అందువల్ల, చిత్తశుద్ధితోనే అల్లాహ్‌ను పిలవాలి. చిత్తశుద్ధితో పిలవడం ఏమిటి? ఆయన ఆజ్ఞలను పాటించడం మరియు ఆయనపై దృఢమైన విశ్వాసం కల్గి ఉండడం.

మరల వారు ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన దేవుడు ఇలా పేర్కొన్నాడు: 'నా సేవకుడు నా గురించి అడిగినప్పుడు, నేను సమీపంలో ఉన్నాను మరియు అతను నన్ను ప్రార్థించినప్పుడు ప్రార్థన చేసే ప్రార్థనకు సమాధానం ఇస్తాను." అయినప్పటికీ, అతని ఉనికిని అనుమానించే కొందరు వ్యక్తులు ఉన్నారు. సర్వశక్తిమంతుడైన దేవుడు పేర్కొన్నాడు 'నా ఉనికికి సంకేతం మీరు నన్ను పిలిచి నన్ను అడగడం. నేను మీతో మాట్లాడతాను, మీకు జవాబిచ్చి మిమ్ము గుర్తుంచుకుంటాను." ఒక హదీసులో పేర్కొనబడినట్లుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒకరు తన మనస్సులో లేదా ఒక సమావేశంలో తనను స్మరించుకున్నప్పుడు అతను వారిని గుర్తుంచుకుంటానని పేర్కొన్నాడు. మరల ఇలా తెలిపారు. " ఒకవేళ మీరు మేము ప్రార్థిస్తున్నాము కాని అల్లాహ్ సమాధానం ఇవ్వడం లేదు అని పలికినచో " ఈ ప్రశ్న లేవనెత్తబడింది మరియు ఇది ఇప్పటికే ప్రస్తావించబడింది " ఆలోచించి చూడండి." మరల ఇలా తెలిపారు. " ఆలోచించి చూడండి. మీరు ఒకచోట నిలబడి చాలా దూరంగా ఉన్న వ్యక్తిని పిలిచిన ఫలితం రానిచో (అతడు తిరిగి సమాధానం ఇచ్చిన అది మీకు వినపడనిచో) అది మీ స్వంత వినికిడి లోపం అవుతుంది. "

అలా దూరంగా నిలబడి ప్రయోజనం లేదన్నది మొదటి అంశం. దగ్గరికి రండి, ప్రేమ ద్వారా సామీప్యత లభిస్తుంది. మీ హృదయంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రేమను సృష్టించుకోండి. మీ చెవులలోనే లోపం ఉన్నది. ఈ ఉదాహరణలో వారి చెవులలో లోపాలు ఉన్నట్లు అనగా విశ్వాసం యొక్క బలహీనత అని అర్థం. ఈ విశ్వాసం యొక్క ఈ బలహీనతను తొలగించి, మీ విశ్వాసాన్ని బలోపేతం చేయండి, అప్పుడు మీరు అతని సామీప్యాన్ని పొందుతారు. "ఆ వ్యక్తి మీ పిలుపును విని ప్రతిస్పందిస్తాడు" – హుజూర్ (అ) ఇలా ఉదాహరిస్తున్నారు. ఒకవేళ మీరు అల్లాహ్‌ను దూరం నుండి పిలిచినా కూడ, ఆ పిలుపు అతనికి చిన్నగా వినిపించిన లేదా గట్టిగా వినిపించిన అతడు తప్పకుండా సమాధానం ఇస్తాడు. " కాని అతడు కూడ దూరం నుండే సమాధానం ఇచ్చినచో " అల్లాహ్ దూరంగా ఉండి సమాధానం ఇచ్చినచో " అప్పుడు మీరు మీ వినికిడి లోపం వలన వినలేక పోతున్నారు. "

సర్వశక్తిమంతుడైన అల్లా మీకు సమాధానం ఇచ్చినప్పటికీ, మీరు మీ విశ్వాసంలో బలంగా లేనందున, మీ ప్రేమలో లోపం ఉన్నందున మరియు మీరు అతని ఆజ్ఞలను పాటించడం లేనందున, అప్పుడు అది వినికిడి లోపంగా మారుతుంది. దాని కారణంగా మీరు అల్లాహ్ మాటలు వినలేరు. అప్పుడు సర్వశక్తిమంతుడైన అల్లా సమాధానం ఇచ్చినప్పటికీ, అతను సమాధానం ఇవ్వలేదనే మీరు చెబుతారు. అతను సమాధానం ఇచ్చినప్పటికీ, మరో మాటలో చెప్పాలంటే, "మీరు పెద్ద స్వరం వినాలనుకుంటే మీ స్వంత స్థితిని మెరుగుపరచుకోండి" లేనిచో మీరు మీ చెవిటి తనం వలన ఆ పిలుపును వినలేరు.

మరల ఇలా తెలిపారు. "మీకు మరియు అతనికి మధ్య తెరలు, అడ్డంకులు మరియు దూరం తగ్గినప్పుడు, మీరు ఖచ్చితంగా దేవుని స్వరాన్ని వింటారు." మీరు ధార్మికతను పెంచుకుంటే, అతని స్వరాన్ని వినాలనే శ్రద్ధ మీలో ఎక్కువగా కల్గుతుంది. మరల ఇలా తెలిపారు. "ప్రపంచం సృష్టించబడినప్పటి నుండి, అతను ప్రత్యేకంగా ఎంచుకున్న వారితో మాట్లాడుతున్నాడని స్థిరమైన రుజువు ఉంది. ఒకవేళ అలా కాకపోతే, క్రమంగా అతని ఉనికి యొక్క భావన కూడా నాశనం అవుతుంది.

కాబట్టి, దేవుని ఉనికిని నిరూపించడానికి అత్యంత అద్భుతమైన మార్గం ఏమిటంటే, మనం అతని స్వరాన్ని వినడం లేదా అతని దైవిక అభివ్యక్తి లేదా దైవిక సంభాషణకు సాక్ష్యమివ్వడం." అంటే కొన్నిసార్లు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక సంకేతం ద్వారా లేదా కేవలం దైవిక సంభాషణ ద్వారా తన ఉనికిని వ్యక్తపరుస్తాడు. నేటి రోజులలో భగవంతుని ప్రత్యక్షముగా చూడడం అంటే అతనితో సంభాషించడం అని అర్థం. " ఈ రోజుల్లో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి ఒకరు పొందే సంకేతాలు వాస్తవానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను చూసినదానికి సాటి అవుతుంది. "నిజానికి, దేవునికి మరియు అన్వేషకుడికి మధ్య ఏదైనా తెర ఉన్నంత వరకు, ఎవరూ అతనిని వినలేరు." అల్లాహ్‌తో సంభాషించినప్పటికీ, వారి మధ్య ఏదైన ముసుగు ఉన్నచో అందువలన కూడ వారు అతని పిలుపును వినలేరు. "వారి మధ్య ఉన్న తెర ఎత్తివేయబడినప్పుడు, అతని స్వరం వినబడుతుంది." (మాల్ఫుజాత్, సంపుటి 7, పేజ 227, ఎడిషన్ 1984) అందువలన, దగ్గరగా రండి. మీరు అతని పట్ల స్వచ్ఛమైన ప్రేమను పెంపొందించుకుంటే, మీరు అతని సామీప్యాన్ని పొందుతారు, మరియు ముసుగు తొలగిపోతుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ "నేను సమాధానమిస్తున్నాను, కానీ మీరు దానిని వినలేరు" అని చెప్పాడు. వాస్తవానికి మొదటి ప్రతిస్పందన అతని పట్ల మనకున్న ప్రేమను పెంచుకోవాలి. మీరు మీ ప్రేమను పెంచుకుంటే, అతని మాట వినలేని మీ అసమర్థత కూడా పోతుంది.

మరొక చోట హుజూర్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. "దుఆ అనేది సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికికి శక్తివంతమైన రుజువు. కాబట్టి, సర్వశక్తిమంతుడైన దేవుడు ఒక చోట ఇలా తెలిపాడు: **వ ఇజా సాఅలక ఇబాదీ అన్నీ ఫ ఇన్నీ ఖరీబున్. ఉజీబు దఅవత ద్దాఇ ఇజా ద ఆని** (బఖర:187) అనగా "దేవుడు ఎక్కడ ఉన్నాడు?, అందుకు తగిన రుజువు ఏమి ఉంది? అని నా సేవకులు మిమ్మల్ని అడిగినప్పుడు, అతను మీకు చాలా దగ్గరగా ఉన్నాడని చెప్పండి. మరియు దీనికి రుజువు ఏమిటంటే, ఒక వ్యక్తి అతనిని పిలిచినప్పుడు, అతను వారికి సమాధానం ఇస్తాడు మరియు ఈ సమాధానం కొన్నిసార్లు నిజమైన కలల ద్వారా వస్తుంది" వారికి నిజమైన కలలు వస్తాయి, తద్వారా వారు సమాధానం పొందుతారు. "కొన్నిసార్లు దైవ స్వప్నాల ద్వారా, మరికొన్ని సార్లు దైవవాణుల ద్వారా, ఇవి కాకుండా దుఆల వలన కూడ సర్వశక్తిమంతుడైన దేవుని శక్తి, సామర్థ్యములు వ్యక్తమవుతాయి. " ఇలా కాకుండా, సర్వశక్తిమంతుడైన దేవుని శక్తి మరియు సామర్థ్యములు కొన్నిసార్లు ప్రార్థనల అంగీకారం ద్వారా కూడ ప్రదర్శించబడుతాయి. సర్వశక్తిమంతుడైన అల్లా వారి ప్రార్థనలు మరియు దుఆలను విన్నాడని మరియు దాని ఫలితంగానే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎవరైనా స్వయంగా అర్థం చేసుకోవచ్చును. మరల ఇలా తెలిపారు "మరియు ఒకరి సమస్యలను ఆయన పరిష్కరించినప్పుడే ఆయన ఎంత శక్తివంతుడో తెలుసుకుంటారు. మొత్తానికి దుఆ గొప్ప నిధి మరియు శక్తి, మరియు పవిత్ర ఖురాన్ దాని వైపు పదేపదే మార్గనిర్దేశం చేసింది మరియు ప్రార్థన ద్వారా వారి కష్టాల నుండి విముక్తి పొందిన వ్యక్తుల స్థితిని కూడా మనకు తెలియజేసింది. ప్రవక్తలు జీవిత లక్ష్యమును పొందుటకు, వారి విజయానికి నిజమైన మరియు సత్యమైన మార్గం కూడ ఈ దుఆయే. కాబట్టి, నేను మీకు సలహా ఇస్తున్నాను, మీ విశ్వాసం మరియు పనులలో బలాన్ని పెంచుకోవడానికి,

ప్రార్థనలో నిమగ్నమై ఉండండి. దుఆల ద్వారా దేవుని దయవలన పుణ్యప్రదమైన మరణం లభించునంత మార్పు ఏర్పడుతుంది. (మాల్ఫుజాత్, సంపుటి 7, పేజీలు. 268 – 269 ఎడిషన్ 1984)

ఇవి పాత కథలు కావు. నిజానికి, నేటి రోజులలో మరియు నేటి కాలంలో కూడా ఇటువంటి ఉదాహరణలు కనిపిస్తాయి. వారి ప్రార్థనల అంగీకారం గురించి వ్రాసే వ్యక్తులు చాలా మంది ఉన్నారు మరియు నేను ఈ సంఘటనలను వేర్వేరు సమయాల్లో కూడా వివరిస్తాను. రివ్యూ ఆఫ్ రిలిజియన్స్ దేవుని ఉనికిపై ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. చాలా మంది ప్రజలు అక్కడ కూడా ప్రార్థన అంగీకరించిన సంఘటనలను వివరించారు. వాస్తవానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనల్ని ఎంతగానో ఆశీర్వదిస్తాడు, తద్వారా మన విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి, అతను మన ప్రార్థనలను ఆమోదిస్తాడు. మరియు తద్వారా అతని శక్తి యొక్క సంగ్రహావలోకనం చూపిస్తాడు. ఎవరి విశ్వాసం బలహీనంగా ఉంటుందో, వారి విశ్వాసంలో వారిని బలపరచడానికి కొన్నిసార్లు ఇలాంటి సంకేతాలను కూడా వారికి చూపిస్తాడు. ఇలా వందలాది మంది నాకు ఉత్తరాలు రాస్తున్నారు, మరికొందరు నన్ను కలుసుకుని ఈ విషయాలను కూడా వివరిస్తున్నారు.

దుఆల యొక్క దైవికజ్ఞాన వాస్తవికతను వివరిస్తూ, హుజూర్ (అ) ఒకచోట ఇలా తెలిపారు. "దైవిక నిజమైన జ్ఞానం, దైవిక దయ ద్వారా మాత్రమే పొందబడుతుంది మరియు అట్టి దయవలనే దాని మనుగడ సాగిస్తుంది. దైవానుగ్రహం దైవిక జ్ఞానాన్ని శుద్ధి చేస్తుంది మరియు ప్రకాశవంతం చేస్తుంది మరియు అంతరాయాలను తొలగిస్తుంది మరియు 'నఫ్స్–ఎ–అమ్మారా' (చెడుకు ప్రేరేపించే ఆత్మ) కు చెందిన అన్ని మలినాలను శుభ్రపరుస్తుంది. ఇది ఆత్మకు బలాన్ని మరియు జీవితాన్ని ప్రసాదిస్తుంది మరియు పాపం యొక్క జైలు నుండి నీచమైన స్వీయతను విడుదల చేస్తుంది."నఫ్స్–ఎ–అమ్మారా' అంటే చెడు వైపు ఒకరిని ప్రేరేపించే స్థితి మరియు దైవిక నిజమైన జ్ఞానం ఒకరిని వారి స్వంత ఖైది నుండి విడుదల చేస్తుంది. "మరియు దాని చెడు కోరికలను ప్రక్షాళన చేస్తుంది. అలాగే, ఈ దైవానుగ్రమం ఒక వ్యక్తిని మానసిక సంబంధమైన కోరికల వరద నుండి కాపాడుతుంది. " నీటి వరద ఏ విధముగానైతే వస్తుందో, అదే విధంగా, మానసిక కోరికల వరద కూడ ఒకటి ఉంటుంది, పాపముల వరద. దాని నుండి మానవున్ని కాపాడడం జరుగుతుంది. "అప్పుడు ఒక వ్యక్తిలో పరివర్తన జరుగుతుంది మరియు అతనికి పాపం పట్ల సహజమైన విరక్తి ఏర్పడుతుంది. ఆ తర్వాత, భగవంతుని అనుగ్రహం ద్వారా ఆత్మ అనుభూతి చెందే మొట్టమొదటి కదలికను దుఆ అంటారు. ఇప్పటికే మేము ప్రతిరోజూ దుఆలు చేస్తున్నామని మరియు మనం చదివే నమాజ్ మొత్తం కూడా దుఆయే కదా! అని ఆలోచించకండి. ఎందుకంటే దైవిక జ్ఞానం లభించిన తరువాత మరియు దైవానుగ్రహం తర్వాత జనించు దుఆ మరొక స్థాయిని, మరొక స్థితిని కల్గి ఉంటుంది." ఈ నమాజులు సాంప్రదాయ పద్ధతిలో చేసేవి, దీని ద్వారా ఒకరు తమ నమాజ్‌ను త్వరితగతిన ప్రారంభించి కొన్ని నిమిషాల్లో పూర్తి చేస్తారు. ఇలాంటివి నమాజ్‌లు కావు, ఇలాంటివి దుఆలు కావు. ఇందుకోసం దైవిక జ్ఞానం అవసరం. మరియు అటువంటి జ్ఞానాన్ని పొందినప్పుడు, నమాజ్‌ల యొక్క ఆనందం పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

మరల ఇలా తెలిపారు. అట్టి నమాజ్‌ల ఆనందం పూర్తిగా భిన్నమైన రంగు మరియు ఛాయతో ఉంటుంది. "అట్టి ప్రార్థన దహించివేస్తుంది. అది బూడిదను చేసే అగ్ని, అది దైవానుగ్రహాన్ని ఆకర్షించే అయస్కాంత శక్తి, అది మరణం, కానీ చివరికి జీవితాన్ని ఇస్తుంది, అది ఉగ్రమైన వరద కానీ చివరికి పడవగా మారుతుంది." ఇది ఒక వరద, కానీ వరద ఒక పడవగా మారుతుంది మరియు వారు కోరుకున్న గమ్యస్థానానికి తీసుకువెళుతుంది. "దాని ద్వారా, ప్రతి సమస్య పరిష్కరించ బడుతుంది మరియు ప్రతి విషం చివరకు విరుగుడుగా మారుతుంది." (లెక్చర్ సియాల్‌కోట్, రూహాని ఖజాయిన్ సంపుటి 20, పేజీ. 222) ఈ విధంగా, పరమాత్మ గురించిన ఈ నిజమైన జ్ఞానాన్ని పొందేందుకు ప్రయత్నించే వారు ధన్యులు.

మరల ఇలా తెలిపారు: "దుఆ దేవుని నుండి వస్తుంది మరియు అతని వద్దకు తిరిగి వెళ్తుంది. దుఆ ద్వారా, దేవుడు ఒక వ్యక్తికి అతని స్వంత ఆత్మ వలె సన్నిహితంగా ఉంటాడు. దుఆ యొక్క మొట్టమొదటి శుభం ఏమిటంటే, ఒక వ్యక్తిలో స్వచ్ఛమైన పరివర్తన తీసుకురావడం. చాలా మంది ప్రజలు ఇలా అడుగుతారు, 'వారి దుఆ అంగీకరించబడినది అని మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిపట్ల సంతోషిస్తున్నాడో? లేదో ? ఎలా తెలుస్తుంది?' అందుకు సమాధానం ఒక స్వచ్ఛమైన పరివర్తనను తెస్తుంది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో ఒక వ్యక్తి యొక్క సంబంధం వారు స్వచ్ఛమైన పరివర్తనను తీసుకువచ్చినప్పుడు మాత్రమే పెరుగుతుంది. ఒక వ్యక్తి సద్గుణ పరివర్తనను తీసుకు వచ్చినప్పుడు, దుఆ యొక్క అంగీకార సంకేతాన్ని వారు చూస్తారు. మరల ఇలా తెలిపారు. "ఒక వ్యక్తి తనలో స్వచ్ఛమైన పరివర్తనను కల్పించుకున్నప్పుడు ఈ మార్పు ద్వారా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన లక్షణాలలో మార్పును వ్యక్తపరుస్తాడు. సర్వశక్తిమంతుడైన భగవంతుని గుణాలు మారనప్పటికీ, వాటిలో ఆధ్యాత్మిక పరివర్తనను తీసుకురావడానికి, ప్రపంచం పూర్తిగా పట్టించుకోని విలక్షణమైన పద్ధతిలో అవి ఆ వ్యక్తికి ప్రత్యక్షమవుతాయి. సర్వశక్తిమంతుడైన భగవంతుని గుణాలు మారడం కాదు, అవి మార్చలేనివి. ఏది ఏమైనప్పటికీ, పరివర్తనను తీసుకువచ్చే వ్యక్తికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అల్లాహ్ యొక్క లక్షణం మార్చబడినట్లు అనిపించే విధంగా మార్గాలను సృష్టిస్తాడు, అయినప్పటికీ దేవుని లక్షణం అలాగే ఉంది, కానీ వాస్తవానికి అది అభివ్యక్తి వారికి అనుకూలంగా ప్రారంభమవుతుంది." మరల ఇలా తెలిపారు. "వేరే దేవుడు ఉన్నట్లు అనిపిస్తుంది, అయితే వాస్తవానికి వేరే దేవుడు లేడు, కానీ అతను వేరే వెలుగులో తనను తాను వ్యక్తపరుస్తాడు. అప్పుడు ఈ పరివర్తనను తీసుకువచ్చే వ్యక్తికి, ఈ ప్రత్యేక అభివ్యక్తి సక్రియం అవుతుంది మరియు ఇతరులకు సహాయం చేయని విధంగా వారికి సహాయం చేస్తుంది. ఇది ఒక అద్భుతం అని పిలుస్తారు. (లిక్చర్ సియాల్‌కోట్, రూహాని ఖజాయిన్ సంపుటి 20, పేజీ. 223)

మరల హుజూర్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. "అల్లాహ్ మహిమాన్వితుడు తన సృష్టి యొక్క అభివృద్ధి కోసం తెరిచిన ఒకే ఒక తలుపు ఉంది. ఆ తలుపు దుఆ. ఒక వ్యక్తి విపరీతంగా మరియు తీవ్రంగా ఏడుస్తూ దేవుని ముందు ఈ ద్వారంలోకి ప్రవేశించినప్పుడు, దయగల ప్రభువు వారికి స్వచ్ఛత మరియు ధార్మికత యొక్క వస్త్రాన్ని కప్పుతాడు. దేవుని మహిమ మరియు శక్తి ఆ వ్యక్తిని ఎంతగానో ఆశ్చర్యపరుస్తాయి, వారు అన్ని చట్టవిరుద్ధమైన మరియు పనికిరాని కార్యకలాపాల నుండి మైళ్ల దూరం పారిపోతారు. (మాల్ఫుజాత్, సంపుటి 5, పేజీ 438, ఎడిషన్ 1984) వారు వాటి నుండి చాలా దూరం. మైళ్ళ దూరం పారిపోతారు. ఈ విధంగా, నిజమైన దుఆ యొక్క లక్షణం ఏమిటంటే, ఒక వ్యక్తి అన్ని వ్యర్థమైన మరియు చెడు కార్యకలాపాల నుండి దూరం అవుతాడు. ధార్మికత వారి స్వభావంలో భాగంగా ఇమిడిపోతుంది. ఆ వ్యక్తి ప్రాపంచిక విషయాల కోసం మాత్రమే ప్రార్థించడు, వారు తమ విశ్వాసం మరియు నిష్ఠాపరతలో పురోగతి సాధించాలని ప్రార్థించడం ప్రారంభిస్తారు. వారు అల్లాహ్ ప్రేమను పొందడం కోసం ప్రార్థన చేయడం ప్రారంభిస్తారు మరియు ఇది నిజమైన విశ్వాసికి సంకేతం. ఇది వారి విశ్వాసాన్ని పరిపూర్ణం చేసిన వ్యక్తికి మరియు శ్రేష్ఠమైన వ్యక్తికి సంకేతం.

మరల దుఆ యొక్క లోతైన తత్వాన్ని వివరిస్తూ, హుజూర్ (అ) ఇలా తెలిపారు. "అల్లాహ్ అనుగ్రహాన్ని పొందేందుకు త్వరిత మార్గం దుఆ. పరిపూర్ణమైన మరియు సంపూర్ణమైన దుఆ యొక్క ముందస్తు ఆవశ్యకత ఏమిటంటే అందులో తప్పనిసరిగా ఆవేదన మరియు వినయపూర్వకమైన విజ్ఞప్తిని కలిగి ఉండాలి. వినయం, వేదన మరియు బాధతో నిండిన ప్రార్థన సర్వశక్తిమంతుడైన దేవుని దయను పొందగలదు"

అంటే, ఒక వ్యక్తి వినయం ఉన్నత స్థాయికి చేరుకోవడం కోసం వారు తమ ప్రార్థనలలో ఏడుస్తారు. అటువంటి ప్రార్థన అంగీకరించబడినప్పుడు, అది ఒకరిని వారి అంతిమ లక్ష్యం వైపు నడిపిస్తుంది. కష్టమేమిటంటే భగవంతుని దయ లేకుండా ఇది కూడా సాధించలేము. కాబట్టి, ఒక వ్యక్తి అటువంటి దశకు చేరుకోవాలంటే అల్లా అనుగ్రహాన్ని పొందవలసి ఉంటుంది. తదనంతరం, పరిష్కారం ఏమిటంటే, వ్యక్తి ఎంత అసంతృప్తుడైనా లేదా ఆసక్తి చూపకపోయినా, నిరంతరం ప్రార్థించడం మాత్రం వారు ఆపకూడదు. ఒకవేళ ఎవరైనా దానిని డాంబికంగా లేదా కృత్రిమంగా నిర్వహించవలసి వచ్చినను నిర్వహించవలెను. ప్రార్థనను దాని నిజమైన రూపంలో అందించడానికి కూడా, ప్రార్థన సహాయం అవసరం."

నిరంతరం దుఆ చేస్తుండాలి మరియు ఆ స్థితిని అభివృద్ధి చేసే వరకు అల్లాహ్ సన్నిధిని వదలకూడదు. అప్పుడే భగవంతుని ఆశీస్సులు రావడం ప్రారంభమవుతుంది.

"చాలా మంది ప్రజలు దుఆలు చేస్తారు, కానీ వారి హృదయాలు అసంతృప్తి చెందుతాయి," అంటే, వారు కొద్దిసేపు ప్రార్థన చేసి, దానిని వదిలివేస్తారు." ఇప్పుడు ఏమీ చేయలేమని వారు అంటున్నారు. అయితే, వారికి నా సలహా ఏమిటంటే, ఈ వినయంలో దీవెనలు ఉన్నాయి.'' ఒక వ్యక్తి భూమిని జల్లెడపడుతున్నట్లు అనిపించవచ్చు " కానీ భూమిని జల్లెడ పట్టడంలో ఆశీర్వాదాలు ఉన్నాయి. చివరికి, ఇందులో ఆశీర్వాదాలు ఉంటాయి, ఎందుకంటే ఒకరి అంతిమ లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. చివరికి అతని మనస్సు అతని నాలుకతో సరిపోయే సమయం వస్తుంది." లక్ష్యం చివరికి సాధించబడుతుంది లేదా వారి హృదయంలో ఉన్న కోరిక

నెరవేరుతుంది. మరల ఇలా తెలిపారు. "వారి మనస్సు మరియు నాలుక ఒకటిగా మారినప్పుడు, దుఆ యొక్క ముందస్తు ఆవశ్యకతలలో ఒకటైన వినయం మరియు ఉత్సాహం స్వయంచాలకంగా అభివృద్ధి చెందుతాయి." అనగా వారు ఏది చెప్పినా అది వారి మనస్సులో నుండి వెలువడుతుంది. అవి ఒకటైన తర్వాత ప్రార్థనకు అవసరమైన పరిస్థితులు అభివృద్ధి చెందుతాయి. "ఒక వ్యక్తి రాత్రిపూట మేల్కొన్నప్పుడు, ఉత్సాహం మరియు చంచలత లేకపోయినా కూడ , ఇంకా వారు అందులో దుఆ చేస్తూ ఓ 'నా ప్రభూ! నా హృదయం నీ నియంత్రణలో మరియు నీ ఆధీనంలో ఉంది. నా హృదయాన్ని శుద్ధి చేయండి. అప్పుడు అది ఆధ్యాత్మిక సంకోచ స్థితిలో ఉన్నప్పుడు, అల్లాహ్ దానిని ఆధ్యాత్మిక విస్తరణ స్థితిగా మారుస్తాడు. అంటే, హృదయం నిరుత్సాహంగా ఉందని మరియు ఉపశమనం కావాలని ప్రార్థించడం. అది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వైపు మొగ్గు చూపుతుంది మరియు అతను దానిలో ఒక కోరికను ప్రేరేపించగలడు. ఆధ్యాత్మిక సంకోచం యొక్క స్థితిని ఆధ్యాత్మిక విస్తరణగా మార్చే విధంగా అల్లా ప్రేమ వర్ధిల్లుతుంది. అప్పుడు, హృదయం మూసుకు పోయినప్పటికీ, అది తెరుచుకుంటుంది మరియు ఒక వ్యక్తిలో ఉత్సాహం పెరుగుతుంది. మనస్సు తెరుచుకోవడం అంటే ఏమిటి? ఎవరైనా దుఆలో ఉత్సాహాన్ని పెంపొందించు కున్నప్పుడు, అట్టి వ్యక్తి ప్రార్థనలో ఏడ్వగలడు. "మరియు ఇది దుఆను అంగీకరించే సమయం." ఒక వ్యక్తి అటువంటి పరిస్థితిని పెంపొందించు కున్నప్పుడు, ఇది దుఆను అంగీకరించే సమయం అని బాగా తెలుసుకోండి. "ఈ క్షణంలో, ఆత్మ దైవిక ప్రవేశద్వారం వద్ద నీటిలా ప్రవహిస్తుంది, కానీ అది అలా పై నుండి క్రిందికి దిగే చుక్కలా ఉంటుంది.." (మాల్ఫుజాత్ ,సంపుటి 6, పేజీలు. 93-94, ఎడిషన్ 1984)

ఈ స్థాయికి అభివృద్ధి చెందినప్పుడు, అది ప్రార్థనను అంగీకరించే సమయం అని ఒక వ్యక్తి స్వయంగా గ్రహిస్తాడు. ఈ దశలోనే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారి కోసం ఏమి చేసినా, అది ఆ వ్యక్తికి మేలు చేస్తుందని ఆ వ్యక్తి నమ్ముతున్నాడు. అంతేగాని అతడు తాను కోరుకున్నదంతా నెరవేరాలని కోరుకోడు. బదులుగా ఆ వ్యక్తి కోసం అల్లాహ్ ఏమి చేసినా తనకు మేలు చేయడం కోసమే చేస్తాడు అనే భావనను విశ్వసిస్తూ వారు ఉత్సాహం మరియు వేదనను పెంపొందించుకున్న తర్వాత గ్రహిస్తారు, సంతృప్తి చెందుతారు. ఈ విధంగా ఒకరి విశ్వాసం అభివృద్ధి చెందుతుంది మరియు హృదయంలో ఎటువంటి మనోవేదన ఉండదు. కాబట్టి, ఇది మనలో మనం అభివృద్ధి చేసుకోవాలి మరియు దీని కోసం వారి పరిస్థితిని విశ్లేషించాలి.

దీనిని గురించి ఇంకా వివరిస్తూ, మరొక సందర్భంలో హుజూర్ (అ) ఇలా అన్నారు, "దుఆ అనేది ప్రతి కష్టాన్ని తేలికగా మారుస్తుంది. ఎవరైనా ప్రార్థిస్తే, చాలా కష్టమైన పని కూడా సులభం అవుతుంది. ప్రార్థన విలువ మరియు శక్తిని గురించి ప్రజలకు తెలియదు. మరల ఇలా తెలిపారు. "దుఆ యొక్క విలువ మరియు శక్తిని గురించి తెలియని వ్యక్తులు సులభంగా నిరుత్సాహానికి గురవుతారు మరియు ఆశను కోల్పోతారు, అయితే దుఆకు పట్టుదల మరియు నిరంతర ప్రయత్నం అవసరం. ఒక వ్యక్తి నిరంతరం కష్టపడితే, ఒక్క చెడు అలవాటు ఏమిటి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అ వ్యక్తి నుండి వేలకొద్దీ చెడులను తొలగించి వారిని పరిపూర్ణ విశ్వాసిగా మారుస్తాడు. అయితే, దీనిని సాధించడానికి చిత్తశుద్ధి మరియు నిరంతర పోరాటం ఒక షరతు. కానీ ఇది దుఆ ద్వారా మాత్రమే సాధించబడుతుంది. (మాల్ఫుజాత్, సంపుటి 6, పేజి 404, ఎడిషన్ 1984) చిత్తశుద్ధి, నిరంతర పోరాటం మరియు కృషి అవసరం. వీటిని మనలో మనం ఇమిడింప జేసుకోవలసిన అవసరం ఉన్నది. దీని కోసం, మనం చిత్తశుద్ధి మరియు కష్టపడే స్థితిని పెంచుకున్నామా లేదా దీనిని సాధించడానికి ప్రయత్నిస్తున్నామా అని మన హృదయాలను విశ్లేషించుకోవాలి. ముజాహదా అంటే అలసిపోకుండా నిరంతర పోరాటం మరియు కృషి చేయడం. మన ప్రాపంచిక వ్యవహారాల కోసం మనం సమష్టి కృషి చేస్తాం మరియు అలసిపోము, అప్పుడు మనం భగవంతుని సామీప్యాన్ని వెతుకుతున్నప్పుడు ఎందుకు అలసిపోవాలి?.

దీని వెనుక ఉన్న తత్వాన్ని వివరిస్తూ హుజూర్ (అ) ఇలా తెలిపారు. "మనిషి ఈ ప్రాపంచిక ఉనికి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించాలి, దానిని నీచమైనదిగా భావించి దాని కోసం ప్రార్థించాలి. ఎందుకంటే, ఒక వ్యక్తి సరైన కార్యాచరణను ఉపయోగించినప్పుడు, దాని కోసం హృదయపూర్వకంగా ప్రార్థించినప్పుడు, చివరికి సర్వశక్తిమంతుడైన అల్లా ఆ వ్యక్తికి మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అప్పుడు వారు పాపపు జీవితం నుండి రక్షింపబడతారు. ఎందుకంటే ప్రార్థన అనేది ఒక చిన్న విషయం కాదు, నిజానికి ఇది మరణానికి ఒక ప్రతి రూపం. ఒక వ్యక్తి ఈ మరణాన్ని స్వయంగా అంగీకరించినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లా ఆ వ్యక్తిని పాప జీవితం నుండి రక్షిస్తాడు, అది ఒక వ్యక్తిని మరణానికి దారి తీస్తుంది. ప్రతిగా, అల్లాహ్ ఆ వ్యక్తికి స్వచ్ఛమైన మరియు ధర్మబద్ధమైన జీవితాన్ని గడపగల సామర్థ్యాన్ని ప్రసాదిస్తాడు. పాప జీవితం కూడా మరణంతో సమానం. ఒక వ్యక్తి పరలోకంలో శిక్షించబడినప్పుడు లేదా కొన్నిసార్లు ఈ జీవితంలో శిక్షను పొందినప్పుడు, అల్లాహ్ ఆ వ్యక్తిని ఆ శిక్ష నుండి రక్షిస్తాడు. మరల ఇలా తెలిపారు. "చాలా మంది ప్రజలు దుఆను ఒక చిన్న విషయంగా చూస్తారు. దుఆ అంటే ఎవరైనా కేవలం నమాజ్ చేసిన తరువాత చేతులు ఎత్తి కూర్చోడం, ఆపై మనసులో ఏది పడితే అది చదవడం కాదు అని గుర్తుంచుకోవాలి. అట్టి దుఆ యొక్క ఉపయోగం ఏమి ఉండదు. ఎందుకంటే ఈ దుఆ సాధారణ మంత్రం కంటే ఎక్కువేమీ కాదు." కొన్ని మతాలవారు మంత్రాలు చదివినట్లే. ఇది కేవలం మంత్రం తప్ప మరొకటి కాదు. అందులో మనస్సు పాలుపంచుకోదు మరియు అల్లాహ్ యొక్క శక్తి మరియు సామర్థ్యంపై విశ్వాసం ఉండదు." ఈ రకమైన ఆరాటం అనేది గుండె లోతుల్లోంచి ఉద్భవించేది కాదు, లేదా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రతిదానిపై అధికారం కలిగి ఉంటాడు అనే వాస్తవాన్ని వ్యక్తపరచదు.

" గుర్తుంచుకోండి, దుఆ అనేది మరణం యొక్క ఒక ప్రతిరూపం. ఒక వ్యక్తి తన మరణ సమయంలో ఎంత వేదనను అనుభవిస్తాడో మరియు అశాంతిగా ఉంటాడో, దుఆకు కూడా అదే వేదన మరియు అభిరుచి అవసరం. ఈ కారణంగా, వేదన మరియు ఉత్సాహం ఒక వ్యక్తిని అధిగమించే వరకు, అది దుఆగా భావించబడదు. "అందుచేత, రాత్రిపూట మేల్కొని, సర్వశక్తిమంతుడైన దేవుని ముందు తన కష్టాలను అత్యంత ఆవేదనతో, ఉత్సాహంతో మరియు తల్లడిల్లుతూ వినయంగా సమర్పించాలి. మృత్యువును జయించినట్లుగా ప్రార్థించాలి. అప్పుడే ఒకరి ప్రార్థనలు అంగీకరించే స్థాయికి చేరుకుంటాయి."మరల ఇలా తెలిపారు. " అన్నిటి కంటే ముఖ్యమైనది మరియు ప్రథమమైన దుఆ ఏమిటనగా, మానవుడు తనను తాను పాపముల నుండి దూరంగా మరియు స్వచ్ఛంగా ఉండేందుకు దుఆ చేసుకోవాలనే విషయాన్ని గుర్తుంచుకోండి."

ఇది చాలా ముఖ్యమైనది. మొట్టమొదట పాపం నుండి విముక్తి మరియు పవిత్రంగా మారడానికి ప్రార్థన చేయాలి.

"ఈ దుఆ నిజానికి దుఆల యొక్క పునాది మరియు సారాంశాన్ని ఏర్పరుస్తుంది. ఇది అన్ని దుఆలకు మూలం. ఎందుకంటే ఈ ప్రార్థన అంగీకరించబడితే, ఒక వ్యక్తి అన్ని రకాల మలినాలనుండి మరియు అపవిత్రత నుండి పరిశుద్ధుడు అవుతాడు మరియు సర్వశక్తిమంతుడైన దేవుని దృష్టిలో పవిత్ర వ్యక్తిగా పరిగణించబడతాడు." ఇది కూడా చాలా ముఖ్యమైనది. ఎవరైనా తమను తాము పవిత్రులుగా భావించుకునే పరిస్థితి ఉండకూడదు. "సర్వశక్తిమంతుడైన దేవుడు తమను శుద్ధి చేశాడని సంతృప్తి చెందే వరకు మరియు వారు ఆయన దృష్టిలో స్వచ్ఛమైన వారిగా పరిగణించబడే వరకు ఎవరైనా ప్రార్థిస్తూనే ఉండాలి. దీనర్థం ఏమిటంటే, పాపం చేయాలనే ఆలోచన ఒకరి మనస్సులోకి రాకూడదు, అలాంటి సందర్భంలోనే, సర్వశక్తిమంతుడైన దేవుడు వారిని అంగీకరిస్తాడు కాబట్టి వారి ఇతర ముఖ్యమైన అవసరాల కోసం ప్రార్థనలు కూడా చేయవలసిన అవసరం లేదు. ఒక వ్యక్తి అటువంటి స్థితిని పొందినప్పుడు, సర్వశక్తిమంతుడైన దేవుడు స్నేహ బంధం యొక్క హక్కులను నెరవేరుస్తాడు మరియు తన సేవకుని అవసరాలను తీరుస్తాడు. మరల ఇలా తెలిపారు. "పాపం నుండి విముక్తి పొందాలనే దుఆకు చాలా కృషి మరియు పోరాటం అవసరం." పాపం నుండి విముక్తి పొందడం సాధారణ దుఆ కాదు, అది చాలా ప్రాముఖ్యత కలిగిన దుఆ." ఇది సర్వశక్తిమంతుడైన దేవుని దృష్టిలో నీతిమంతుడు మరియు సద్గుణవంతుడు కావడానికి వీలు కల్పిస్తుంది."

| అహాదీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

| అహాదీస్ బోధనలు | **"ఒక ముసల్మాను యొక్క విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చోవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబీహ్, కితాబుల్ అదబ్, బాబుల్ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)*

ఒకడు సర్వశక్తిమంతుడైన దేవుని దృష్టిలో నీతిమంతుడు మరియు సద్గురువుగా మారాలి కాని వారి స్వంత అంచనాలో లేదా ప్రజల దృష్టిలో కాదు. “ హృదయంపై ఉన్న తొలి తెరలను తొలగించాలి. వాటిని తొలగించిన తర్వాత, గుండెపై ఉన్న అన్ని ముసుగులు తొలగించబడటానికి ఎక్కువ శ్రమ మరియు కృషి అవసరం ఉండదు. ఎందుకంటే సర్వశక్తిమంతుడైన దేవుని దయ ద్వారా, వేలాది బలహీనతలు స్వయంగా తొలగించబడతాయి. ఒకరు అంతర్గత స్వచ్ఛతను పెంపొందించుకుని, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో నిజమైన బంధాన్ని ఏర్పరుచుకున్నప్పుడు, సర్వశక్తిమంతుడైన దేవుడే వారి సంరక్షకుడు మరియు పోషకుడు అవుతాడు. అటువంటి సందర్భంలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు వారి అవసరాలను సమర్పించే ముందు కూడా, అది ప్రాపంచిక అవసరం అయినప్పటికీ, అల్లాహ్ దానిని స్వయంగా నెరవేరుస్తాడు. ఇది చాలా క్లిష్టమైన విషయం, ఇది ఈ స్థితిని పొందిన వ్యక్తికి మాత్రమే తెలుస్తుంది. అంతకు ముందు, దీనిని అర్థం చేసుకోవడం చాలా కష్టం, అయినప్పటికీ, దీనికి అసాధారణమైన పద్ధతిలో కష్టపడాల్సిన అవసరం ఉంది, ఎందుకంటే దుఆకు కష్టపడాల్సిన అవసరం ఉంది. ఎవరైతే ప్రార్థన విషయంలో అజాగ్రత్తగా ఉండి, దానికి దూరంగా ఉంటాడో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కూడా అలాంటి వ్యక్తి పట్ల ఎలాంటి శ్రద్ధ చూపడు.” తొందర పడటం వల్ల ప్రయోజనం ఉండదు “సర్వశక్తిమంతుడైన దేవుడు తాను కోరుకున్నది మరియు అతను కోరుకున్నప్పుడల్లా మంజూరు చేయగలడు. సర్వశక్తిమంతుడైన దేవుడు తాను కోరుకున్నది మరియు అతను కోరుకున్నప్పుడల్లా మంజూరు చేయగలడని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. “తక్షణమే ఏదైనా మంజూరు చేయనందుకు ఫిర్యాదు చేయడం మరియు చెడుగా ఆలోచించడం ప్రారంభించడం అన్వేషకుడికి తగినది కాదు, వాస్తవానికి అతను స్థిరత్వం మరియు ఓర్పుతో ప్రార్థన కొనసాగించాలి. (మాల్ఫుజాత్, సంపుటి 6, పేజీలు. 406–407, ఎడిషన్ 1984)

అందువల్ల, ప్రార్థన షరతుల్లో ఒకటి స్థిరత్వం మరియు అత్యంత ముఖ్యమైన ప్రార్థనలలో ఒకటి పరిశుద్ధి కావాలని ప్రార్థించడం, అటువంటి స్వచ్ఛతగల వారు సర్వశక్తిమంతుడైన దేవుని దృష్టిలో స్వచ్ఛమైనవారిలో ఒకరిగా పరిగణించబడుతారు.

ప్రార్థన అంగీకరించడానికి ఒకరి పరిస్థితి ఎలా ఉండాలి? దీనికి సంబంధించి, హుజూర్ (అ) ఇలా తెలిపారు. “ఒక వ్యక్తి అత్యంత ఉత్సాహంతో ప్రార్థించినప్పుడు ఆ ప్రార్థన అంగీకార స్థాయికి చేరుకుంటుంది.”

ఎవరైనా తీవ్ర స్థాయిలో ప్రార్థించినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దానిని అంగీకరించిన సంకేతాలు మరియు దాని నెరవేర్పుకు మార్గాలు కనిపిస్తాయి. ప్రారంభ సాధనాలు మొదట స్వర్గంలో స్థాపించబడ్డాయి మరియు దాని ప్రభావాలు భూమిపై వ్యక్తమవుతాయి. (సర్వశక్తిమంతుడైన అల్లా ప్రార్థనను అంగీకరించి, ఆపై ఒక ఆజ్ఞను జారీ చేస్తాడు మరియు దాని ప్రభావాలు భూమిపై కనిపించడం ప్రారంభిస్తాయి). ఇది చిన్న విషయం కాదు, ఇది ఒక అసాధారణ నిజం. నిజానికి, సత్యం ఏమిటంటే, ఎవరైతే భగవంతుని ప్రత్యక్షతను సాక్ష్యమివ్వాలని కోరుకుంటారో, అతను తప్పనిసరిగా దుఆలు చేస్తూండాలి. (మాల్ఫుజాత్, సంపుటి 6, పేజీలు. 408–409, ఎడిషన్ 1984)

సర్వశక్తిమంతుడైన అల్లా ఇప్పటికే ఏది నిర్ణయిస్తాడో అది ఖచ్చితంగా జరుగుతుంది . మరియు అది జరుగుతుందని అతని దివ్య జ్ఞానంలో ఉంది, అప్పుడు ప్రార్థన చేయడంలో ప్రయోజనం ఏమిటి? అని కొందరు ప్రశ్న అడుగుతారు. ఇటువంటి ప్రశ్నలు తలెత్తుతాయి . ప్రార్థన యొక్క అవసరం ఏమిటి? అనే విషయాన్ని ఆవశ్యకతను వివరిస్తూ

హుజూర్ (అ) ఒకచోట ఇలా తెలిపారు. “దుఆ స్వీకరించబడు అంశం తమ ఆధీనంలో ఉన్నచో మానవుడు కోరుకున్నట్లు చేయవచ్చు. అందుకే ఫలాన స్నేహితుడు లేదా బంధువుకు అనుకూలంగా ఆ విషయం నెరవేరుతుందని మనం చెప్పలేము.” కొందరు దుఆలు చేయమని అడుగుతారు, కానీ అది ఖచ్చితంగా నెరవేరుతుంది అని చెప్పలేము. ఇది మన చేతుల్లో లేదు, వాస్తవానికి ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క అభీష్టం. అతను దానిని ఎలా నెరవేర్చాలని కోరుకుంటాడో అలాగే జరుగుతుంది. “కొన్నిసార్లు, అత్యవసరమైన అవసరం ఉన్నప్పటికీ, దాని కోసం ప్రార్థించలేరు.” కొన్నిసార్లు, ఒక వ్యక్తి ప్రార్థనల కోసం అభ్యర్థించబడతాడు మరియు దాని కోసం చాలా అవసరం కూడా ఉంది, అయినప్పటికీ, హృదయంలో దుఆ పరిస్థితి ఏర్పడదు. “ పైగా మనస్సు కఠినముగా మారుతుంది. ప్రజలు దాని చిక్కుల గురించి తెలియకపోవడమే దీనికి కారణం.” ఆ భవిష్య చిక్కులను గూర్చి ఆయా ప్రజలకు తెలియదు. “ అందుకే వారు మార్గభ్రష్టులవుతారు. ” దుఆ కోసం మనస్సు చలించనప్పుడు దుఆ చేసి ఏం ప్రయోజనం?. మరల ఇలా తెలిపారు. “వారు సందేహాలను కలిగి ఉంటారు. దానిని వారి విధిగా భావిస్తారు.” ఏది జరుగాలని ఉన్నదో అదే జరుగుతుంది కాబట్టి దుఆ చేయవలసిన అవసరం ఏమున్నది?. అందుకోసం ప్రయత్నించ వలసిన అవసరం ఏమున్నది?. మరల ఇలా తెలిపారు. “దీనికి సమాధానం ఏమిటంటే, వాస్తవానికి దేవునికి అన్ని విషయాల గురించి తెలుసు, అయితే, సర్వశక్తిమంతుడైన దేవుడు ఇకపై దానిపై అధికారం కలిగి లేడని మరియు దానిని నెరవేర్చలేడని ఏ మాత్రం దాని అర్థం కాదు.” అల్లాహ్‌కు ఆ విషయంను గూర్చి ముందే తెలిసి ఉన్నచో అది ఇప్పుడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క శక్తికి మించినది అని అర్థం కాదు. “ ఒకవేళ ప్రజల విశ్వాసం ఇదే అయినచో అనగా ఏదైతే జరగాలో అది జరుగుతుంది. కావున మన ప్రయత్నం, కృషి అన్ని వృధాయే అని ఆలోచించడం సరికాదు. ” మరల ప్రాపంచిక ఉదాహరణలను ఇస్తూ హుజూర్ (అ) ఇలా తెలిపారు. “ఉదాహరణకు, ప్రజలు తలనొప్పిని అనుభవిస్తున్నట్లయితే చికిత్స కోసం ఎందుకు వెతుకుతున్నారు? దానికి అదే స్వయంగా మెరుగుపడాలి కదా!........ “ అదే విధముగా దాహం వేసినప్పుడు నీళ్లు ఎందుకు తాగుతారు?” కొంతమంది నీరు త్రాగని వారు ఉన్నారు మరియు వారి దాహం చివరికి దానంతటదే తగ్గిపోతుంది, అయినప్పటికీ వారు వెంటనే నీరు త్రాగుతారు. అయితే, ఇది అందరికీ కాదు, దాహంతో చనిపోయే వ్యక్తులు కూడా ఉన్నారు. అందుచేత, దాహం తీర్చుకోవడానికే వారు చల్లటి నీరు త్రాగడానికి కారణం. “వాస్తవం ఏమిటంటే ఒకరి ప్రయత్నాలు దాని పరిణామాలను చూపుతాయి.”ఒకరు ఎప్పుడైతే ప్రయత్నం చేస్తారో, కష్టపడి ప్రార్థిస్తారో అది కూడా తన ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క జ్ఞానంలో ఏదైనా ఖచ్చితంగా ఆ విధంగానే జరుగుతుందని ఉన్నంత మాత్రమున, ప్రార్థనల వలన అతను తన శాసనాన్ని మార్చలేడని అర్థం కాదు. ఉదాహరణకు, ఎవరైనా చనిపోతారని వైద్యులు చెబితే, ప్రార్థనల కారణంగా అతనికి మరో 9 సంవత్సరాలు, 4 సంవత్సరాలు లేదా 10 సంవత్సరాల జీవితం మంజూరు చేయబడుతుంది, అప్పుడు ఆ వ్యక్తి యొక్క విధిని మార్చినది సర్వశక్తిమంతుడైన అల్లాహ్. వాస్తవానికి, ప్రతి ఒక్కరూ చనిపోతారు కానీ సర్వశక్తిమంతుడైన అల్లా ఒకరి జీవితాన్ని పొడిగించగలడు మరియు వారికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించగలడు. మరల ఇలా తెలిపారు. “ప్రార్థన ఒక అద్భుతమైన విషయం. చివరికి అది ఒక్క క్షమాపణ అయినా ఇస్తుంది.”

ప్రార్థన ద్వారా ఒకరి లక్ష్యం సాధించబడకపోతే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రార్థనను పరిగణనలోకి తీసుకుంటాడు మరియు ఇహలోకంలో లేదా పరలోకంలో ఉన్నా, అది అతని క్షమాపణకు సాధనంగా మారుతుంది మరియు అతనికి సౌలభ్యాన్ని కలిగిస్తుంది. “తరువాత, క్రమంగా ఈ సర్వశక్తిమంతుడైన దేవుడు అటువంటి వ్యక్తి పట్ల తన దయను ప్రసాదిస్తాడు.” ఎవరైనా ఈ జీవితంలో క్షమాపణ యొక్క ప్రతిఫలాన్ని పొందడం ప్రారంభిస్తే, వారు సర్వశక్తిమంతుడైన దేవుని దయతో కూడిన దయలను చూడగలుగుతారు. మరల ఇలా తెలిపారు. “ప్రార్థన చేయకపోవడం వల్ల మొదట్లో గుండెపై తుప్పు ఏర్పడుతుంది.” ప్రార్థన చేయకపోవడం వల్ల గుండెపై తుప్పు ఏర్పడుతుంది. “అప్పుడు కాఠిన్యం అభివృద్ధి చెందుతుంది.” హృదయం గట్టిపడుతుంది, ప్రార్థన యొక్క ఆవశ్యకతను ప్రశ్నించడానికి దారి తీస్తుంది మరియు అల్లాహ్‌కు దూరంగా వెళ్లడం ప్రారంభిస్తారు. “అప్పుడు అల్లాహ్ నుండి విడిపోయిన భావన అభివృద్ధి చెందుతుంది.'' సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి దూరం సృష్టించబడుతుంది. అల్లాహ్‌ను మరొకరిగా భావించడం ప్రారంభిస్తారు. “అప్పుడు శత్రుత్వం” అభివృద్ధి చెందుతుంది. “చివరికి, విశ్వాసం కోల్పోవడం అవుతుంది.” (మాల్ఫుజాత్, సంపుటి 6, పేజి 423, ఎడిషన్ 1984) చివరికి అల్లాహ్‌పై విశ్వాసం పోతుంది.

ఇవి వివిధ స్థాయిలు, ప్రార్థన చేయని వారిలో ఇవి అభివృద్ధి చేయవచ్చు. మొదట్లో, ఒకరి హృదయం తుప్పు పట్టి, తర్వాత వారి హృదయం గట్టిపడి, తర్వాత వారు నాస్తికులు అవుతారు. ఒక వ్యక్తికి భగవంతుని పట్ల శత్రుత్వం మరియు ద్వేషం పెరుగుతాయి మరియు అలాంటి ఆలోచనలు అభివృద్ధి చెందుతాయి మరియు తరువాత ఒక వ్యక్తి పూర్తిగా విశ్వాసం కోల్పోయి నాస్తికుడు అవుతాడు. కాబట్టి,

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**“అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. ”**
**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***

ప్రార్థన వైపు ఖచ్చితంగా రావాలి. ఎవరైనా తమ విశ్వాసాన్ని కోల్పోతే, వారి ఇహలోకం మరియు తదుపరి జీవితం నాశనం అవుతుంది.

ఇస్లాం యొక్క విశిష్టమైన ప్రార్థనను వివరిస్తూ, హుజూర్ (అ) ఇలా తెలిపారు. "ప్రార్థన అనేది ఇస్లాం యొక్క ప్రత్యేక విశిష్టత మరియు ముస్లింలు దాని గురించి చాలా గర్వంగా భావిస్తారు, కానీ ప్రార్థన అనేది కేవలం పదాల ఉచ్చారణ కాదని గుర్తుంచుకోండి. బదులుగా, ఇది సర్వశక్తిమంతుడైన దేవుని భయంతో హృదయాన్ని నింపడానికి కారణమవుతుంది మరియు దాసుని యొక్క ఆత్మ దైవిక ప్రవేశంపై నీటిలా ప్రవహిస్తుంది, దాని బలహీనతలు మరియు తప్పుల కోసం శక్తివంతమైన దేవుని నుండి బలం, శక్తి మరియు క్షమాపణ కోరుతుంది. మరో మాటలో చెప్పాలంటే, ఈ స్థితిని మరణం అని పిలుస్తారు. ఈ పరిస్థితి వచ్చినప్పుడు, అంగీకారానికి తలుపు తెరవబడిందని ఖచ్చితంగా తెలుసుకోండి (అనగా ప్రార్థన అంగీకరించే తలుపు తెరవబడింది) మరియు చెడు పనుల నుండి సురక్షితంగా ఉండటానికి మరియు స్థిరంగా ఉండటానికి ఒక ప్రత్యేక సామర్థ్యం, ఆశీర్వాదం మరియు స్థిరత్వం అందించబడతాయి. పుణ్యకార్యాలను ఏర్పాటు చేస్తారు. ఇది అన్నింటికంటే ఉత్తమమైన పద్ధతి, అయినప్పటికీ, ప్రార్థన యొక్క నిజమైన వాస్తవికత గురించి ప్రజలకు తెలియకపోవడమే గొప్ప కష్టం మరియు ఈ యుగంలో ప్రజలు దానిని తిరస్కరించడానికి ఇదే కారణం, ఎందుకంటే వారు దాని ఫలితాలను చూడలేదు. వారు దీనిని ఖండించడానికి మరొక కారణం ఏమిటంటే, ఏది జరగాలో అదే జరుగుతుంది అనే భావన. (ఇది ముందస్తు నిర్ణయం యొక్క అదే అంశం) అందుకే ప్రార్థన అవసరం ఏమిటి? అని ఆలోచిస్తుంటారు. అయినప్పటికీ, ఇది సాకు తప్ప మరొకటి కాదని నాకు తెలుసు. ఎందుకంటే వారు ప్రార్థన యొక్క అనుభూతిని పొందలేదు. వారికి దాని చిక్కుల గురించి తెలియదు, అందుకే ప్రజలు అలాంటి మాటలు చెబుతారు. అలా కాకుండా అంత కాన్ఫిడెంట్‌గా ఉంటే అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం చేయించుకోవడం ఎందుకు? ఇతర ప్రాపంచిక విషయాలు ప్రభావం చూపినప్పుడు, ఆధ్యాత్మిక ప్రపంచం కూడా దాని ప్రభావాలను చూపకపోవడానికి కారణం ఏమిటి? (మరో మాటలో చెప్పాలంటే, ఆధ్యాత్మిక అంశాలు కూడా వాటి ప్రభావాలను కలిగి ఉండకూడదా?) " వాటిలో ప్రార్థన ఒక అద్భుతం ?" (మాల్ఫుజాత్ సంపుటి 7, పేజీలు. 263-264, ఎడిషన్ 1984)

వాస్తవానికి ప్రార్థనలు ప్రభావం చూపుతాయి. అల్లాహ్ యొక్క హక్కులను మరియు అతని దాసుల యొక్క హక్కులను నెరవేర్చే మరియు గొప్ప దృఢత్వంతో చేసే దేవుని ఆజ్ఞల ప్రకారం పనిచేసే వారి ప్రార్థనలు ప్రభావం చూపుతాయి. వారు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి ఆజ్ఞాపించిన వాటిని చేస్తారు మరియు అతను నిషేధించిన వాటికి దూరంగా ఉంటారు. ఇంకా, వారి విశ్వాసంలో కొంచెం బలహీనత కూడా ఉండదు, బదులుగా వారు నిరంతరం విశ్వాసాన్ని పెంచుకుంటారు. అప్పుడే ఈ స్థాయి అభివృద్ధి చెందుతుంది.

మరల స్థిరత్వంతో నిరంతరం ప్రార్థించడం గురించి, హుజూర్ (అ) ఇలా తెలిపారు. "ఎవరు కూడ అర్ధమనస్సుతో లేదా నిరాశతో ప్రార్థనలు చేయకూడదు లేదా తొందరగా అలసిపోకూడదు.వారి ప్రార్థన దాని పూర్తి ప్రభావాన్ని చూపే వరకు వదిలిపెట్టకూడదు. అలసిపోయే వారు పొరపాటులో ఉన్నారు, ఎందుకంటే ఇది నిరాశ్రయులకు సూచన. నా అంచనా ప్రకారం ప్రార్థన ఒక అద్భుతమైన విషయం మరియు నేను నా స్వంత అనుభవం నుండి చెబుతున్నాను, ప్రణాళిక ద్వారా పరిష్కరించలేని కష్టాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రార్థన ద్వారా పరిష్కరిస్తాడు. ఇది కేవలం ఊహ కాదు నిజం. ప్రార్థన అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుందని నేను నిజాయితీగా చెబుతున్నాను. దాని ద్వారా, అనారోగ్యం నయమవుతుంది, ఈ ప్రపంచంలోని కష్టాలు మరియు నష్టాలు తొలగిపోతాయి, శత్రు కుట్రల నుండి రక్షిస్తుంది మరియు ప్రార్థన ద్వారా సాధించలేనిది ఇంకా ఏమి ఉంటుంది అని చూసినచో అన్నింటికంటే మించి మనిషిని పరిశుద్ధి చేస్తుంది. (మరియు ఇది ఒక వ్యక్తి యొక్క అంతిమ లక్ష్యం, అనగా విశ్వాసి మరియు సేవకుని అల్లాహ్ యొక్క అంతిమ లక్ష్యం.) ఇది సర్వశక్తిమంతుడైన దేవునిపై సజీవ విశ్వాసాన్ని అందిస్తుంది, ఇది పాపం నుండి విముక్తిని అందిస్తుంది మరియు ధర్మంలో స్థిరత్వాన్ని అందిస్తుంది. దుఆలో విశ్వాసం ఉన్నవాడు చాలా అదృష్టవంతుడు, ఎందుకంటే అతను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆశ్చర్యకరమైన శక్తిని చూస్తాడు మరియు ఆయనను చూడగానే సర్వశక్తిమంతుడైన దేవుడిని విశ్వసిస్తాడు, ఎందుకంటే అతను సర్వశక్తిమంతుడు, దయగలవాడు. (మాల్ఫుజాత్, సంపుటి 7, పేజీలు. 265-266 ఎడిషన్ 1984)

తమ ప్రార్థనలు అంగీకరించబడనందున ఫిర్యాదు చేసేవారికి ప్రతిస్పందనగా హుజూర్ (అ) ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను నిందిస్తూ, 'మేము నమాజ్‌లు మరియు దుఆలు చేస్తాము, కానీ అవి అంగీకరించబడలేదు' అని తమను తాము నిందారహితంగా భావించే వారు చాలా మంది ఉన్నారు. ఇది వారి స్వంత తప్పు. నమాజ్ మరియు దుఆలు అజాగ్రత్త నుండి విముక్తి పొందే వరకు ఆమోదం పొందలేవు. ఎవరైనా తీపిగా కనిపించినా విషం కలిపిన దానిని తిన్నట్లయితే, విషం తీపి నుండి వేరు చేయబడదు, అయితే తీపిని అనుభవించే ముందు, విషం ప్రభావం చూపుతుంది మరియు దాని పనిని అది చేస్తుంది (అంటే అది వ్యక్తిని చంపుతుంది) . అందుకే అజాగ్రత్తగా చేసే ప్రార్థనలు అంగీకరించబడవు ఎందుకంటే అజాగ్రత్త మొదట ప్రభావం చూపుతుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు పూర్తిగా అంకితమైన వ్యక్తి వారి ప్రార్థనలను అంగీకరించకపోవడం అసాధ్యం, అయినప్పటికీ వారు అవసరమైన నిబంధనలను పూర్తిగా నెరవేర్చాలి. " (మాల్ఫుజాత్ సంపుటి 5, పేజీలు. 318-319, ఎడిషన్ 1984)

అందువల్ల, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విధించిన షరతుల్లో ఒకటి ఏమిటంటే, అతను చెప్పేదానికి కట్టుబడి ఉండాలి, దానిని వినాలి మరియు దానిపై దృఢమైన విశ్వాసం ఉండాలి. ఏమి జరిగినా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను విడిచిపెట్టకూడదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మార్గాలను సృష్టించాడు మరియు ప్రార్థనలతో పాటు వాటిని ఉపయోగించడం కూడా అవసరం.

ఈ విషయాన్ని గూర్చి తెల్పుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. "ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకోని వ్యక్తి ప్రార్థనలు చేయడు, బదులుగా వారు సర్వశక్తిమంతుడైన దేవుణ్ణి పరీక్షిస్తారు. అందువల్ల, ప్రార్థనలు చేసే ముందు, ఒకరు తమ ప్రయత్నాలన్నింటినీ ఖర్చు చేయడం అవసరం. ప్రార్థన అంటే సరిగ్గా ఇదే: ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ్. అనగా మమ్మల్ని సరైన మార్గంలో నడిపించుము. ముందుగా మానవుడు తమ చర్యల ద్వారా తమ విశ్వాసాన్ని ప్రదర్శించడం అవసరం, ఎందుకంటే మార్గాల ద్వారా సంస్కరించడం సర్వశక్తిమంతుడైన భగవంతుని ఆచారం (అనగా సంస్కరణల కోసం కొన్ని మార్గాలు అందించబడ్డాయి). సంస్కరణ వైపు నడిపించే మార్గాలను దేవుడు సృష్టిస్తాడు. ప్రార్థన ఉన్నప్పుడు దాని అవసరం ఏమిటి? అని ఆలోచించేవారు దీని గురించి ఆలోచించాలి. అలాంటి మూర్ఖులు ప్రార్థన అనేది ఒక రహస్య మార్గం అనే వాస్తవాన్ని గురించి ఆలోచించాలి. ప్రార్థన ఇతర మార్గాలను తెచ్చే సాధనం కూడా. (మాల్ఫుజాత్, సంపుటి 1, పేజి 124)

మరల ఇలా తెలిపారు."ఇస్లాం యొక్క నిజమైన సారాంశం ఏమిటంటే, మానవుని ఆనందం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆనందానికి లోబడి ఉంటుంది. వాస్తవికత ఏమిటంటే, ఒక వ్యక్తి తన స్వంత ఉద్దేశ్యంతో ఈ దశకు చేరుకోలేడు. ప్రయత్నాలు చేయడం మనిషి యొక్క బాధ్యత, అయితే, ఈ స్థితిని సాధించడానికి నిజమైన మార్గం ప్రార్థన. మనిషి బలహీనుడు అతను ప్రార్థన ద్వారా బలం మరియు సహాయం పొందే వరకు అతను ఈ కష్టమైన మార్గంలో ప్రయాణించలేడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా మనిషి యొక్క బలహీనత గురించి ఖులిఖల్ ఇన్సాను జయీఫా అని చెప్పాడు. "అంటే మనిషి బలహీనంగా సృష్టించబడ్డాడు.' ఈ బలహీనత ఉన్నప్పటికీ, మానవుడు స్వంత శక్తి ద్వారా ఉన్నతమైన హోదాను మరియు ఉన్నత స్థితిని పొందామని ప్రకటన చేయడం వారి అజ్ఞానానికు నిదర్శనం. దీన్ని సాధించడానికి చాలా ప్రార్థనలు అవసరం. ప్రార్థన అనేది ఒక అద్భుతమైన శక్తి, దీని ద్వారా పెద్ద పెద్ద కష్టాలు పరిష్కరించబడతాయి మరియు ప్రమాదకరమైన దశలను చాలా సులభంగా దాటగలుగుతారు, ఎందుకంటే ప్రార్థన అనేది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి వచ్చే ఆశీర్వాదాలు మరియు బలాన్ని పొందే పాత్ర లాంటిది. ప్రార్థనలో విస్తృతంగా నిమగ్నమై ఉన్న వ్యక్తి చివరికి ఆ ఆశీర్వాదాలను పొందుతాడు మరియు సర్వశక్తిమంతుడైన దేవుని సహాయాన్ని పొందుతాడు, తద్వారా అతని ఉద్దేశ్యాన్ని సాధిస్తాడు. సర్వశక్తిమంతుడైన దేవుడు ప్రార్థనలను మాత్రమే కోరుకోడు, బదులుగా మానవుడు మొదట అన్ని ప్రయత్నాలను చేపట్టాలి మరియు ప్రార్థనలతో పాటు కృషి చేయాలి.

ఆచరణాత్మక మార్గాలను విస్మరించడం మరియు కేవలం ప్రార్థనపై ఆధారపడడం అంటే ప్రార్థన యొక్క మర్యాదలను గురించి తెలియకపోవడమే మరియు సర్వశక్తిమంతుడైన దేవుడిని పరీక్షించడం. స్పష్టమైన మార్గాలపై మాత్రమే ఆధారపడటం మరియు ప్రార్థనలకు ప్రాముఖ్యత లేదని భావించడం నాస్తికత్వం.

ఖచ్చితంగా, ప్రార్థన గొప్ప నిధి అని మీరు అర్థం చేసుకోవాలి. ప్రార్థనను విడిచిపెట్టని వ్యక్తి ఈ జీవితంలో లేదా తదుపరి జీవితంలో నాశనాన్ని చూడలేడు. అలాంటి వ్యక్తి ఎప్పుడూ కాపలాగా నిలబడిన సాయుధ సైనికులతో చుట్టుముట్టబడిన కోటలో సురక్షితంగా ఉంటాడు. అయితే, ప్రార్థనను పట్టించుకోని వ్యక్తి ఆయుధాలు లేకుండా బలహీనంగా ఉండి, క్రూరమృగాలు మరియు ప్రమాదకరమైన

జంతువులతో నిండిన అడవిలోకి వెళ్ళిన వ్యక్తి లాంటివాడు. అతను సురక్షితంగా లేడని మరియు అతని మాంసం మరియు ఎముకలను మ్రింగివేసే ప్రమాదకరమైన జంతువు తనపై దాడి చేస్తుంటాయని అతనికి తెలుసు. కాబట్టి, మనిషి యొక్క నిజమైన గౌరవం మరియు అతని రక్షణ ప్రార్థనపై ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోండి. అతను దానిలో నిమగ్నమై ఉన్నంత కాలం ఈ ప్రార్థన అతనికి ఆశ్రయం.

(మాల్ఫుజాత్ సంపుటి 7, పేజీలు. 192-193, ఎడిషన్ 1984)

మరల ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన దేవుడు మానవుడు తనతో సంబంధాన్ని ఏర్పరచుకోవాలని కోరుకుంటాడు మరియు అతని సమక్షంలో ప్రార్థనలు చేయడానికి అతనితో అనుబంధం అవసరం. అనుబంధం లేకుండా ప్రార్థనలు చేయలేము. గతంలోని పెద్దలు కూడా ప్రార్థన చేసే ముందు ఒక అనుబంధాన్ని ఏర్పరచుకోమని ప్రజలకు సలహా ఇచ్చేవారు. ఎవరు ఎలాంటి లక్ష్యం లేకుండా బజారులో నడిచి, తమకు సంబంధం లేని వారి దగ్గరికి వెళ్ళి, 'నువ్వు నా మిత్రుడివి' అని చెప్పుకోలేరు. అలాంటి వ్యక్తి కొరకు అతని హృదయంలో ఎలాంటి బాధ ఉండదు, దుఆ కోసం ఎలాంటి ఉత్సాహం ఏర్పడదు. అజాగ్రత్తగా ఉంటూ, 'నేను సర్వశక్తిమంతుడైన దేవునితో సంబంధాన్ని ఏర్పరచుకున్నాను' అని కేవలం పదాలు పలకడం ద్వారా సర్వశక్తిమంతుడైన దేవునితో సంబంధాన్ని ఏర్పరచుకోలేడు." మరల ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన అల్లాతో సంబంధాన్ని ఏర్పరచుకోవడానికి, అంకిత భావం అవసరం." మరల ఇలా తెలిపారు. " ఈ భావాన్ని స్థాపించమని మేము మా జమాత్ సభ్యులను పదే పదే ఆజ్ఞాపిస్తున్నాము ఎందుకంటే ఈ ప్రపంచపు మొగ్గు మరియు దాని ప్రేమ హృదయాలలో ఎన్నడు చల్లబడదు మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల సహజమైన ఉత్సాహం మరియు భక్తి అభివృద్ధి చెందదు, అలాంటప్పుడు మానవుడు స్థిరత్వాన్ని పొందలేడు." (మాల్ఫుజాత్, సంపుటి 7, పేజీలు. 42-43, ఎడిషన్ 1984)

అందువల్ల, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు అందించిన దీవెనల నెలలో ముఖ్యంగా ఈ రోజుల్లో, మనలో స్వచ్ఛమైన మార్పును తెచ్చుకుంటూ ప్రార్థనలపై దృష్టి పెట్టాలి. ఇహలోకంలో మరియు పరలోకంలో మన జీవితాన్ని అలంకరించుకోవడానికి ఇదే మార్గం. రంజాన్ చివరి పది రోజులు ప్రారంభం కాబోతున్నాయి, ఈ సమయంలో మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞలను మనకు మార్గనిర్దేశం చేయడం ద్వారా, మన విశ్వాసాన్ని బలపరుచుకోవడం ద్వారా, రాత్రిపూట మేల్కొలపడం ద్వారా మరియు ఆయనకు సాష్టాంగం చేయడం ద్వారా ఆయనకు మరింత దగ్గరవ్వడానికి కృషి చేయాలి, తద్వారా మనం ఆ మార్గదర్శకత్వాన్ని పొందగలము. దానిని మనం అనుసరించాలని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కోరుకుంటాడు.

రంజాన్ నెలలో, జమాత్ పురోగతి కోసం ప్రత్యేకంగా ప్రార్థించండి. అల్లాహ్ మార్గంలో ఖైదు చేయబడిన వారి కోసం ప్రార్థించండి, అల్లా వారి విడుదలకు త్వరగా మార్గాలను సమకూర్చుగాకా!. యెమెన్‌లో ఖైదు చేయబడిన వారి % కోసం ప్రార్థించండి, ప్రత్యేకించి, ఇతర ఖైదీలకు దూరంగా ఒక చిన్న గదిలో నిర్బంధించబడిన ఒక మహిళ కూడ ఉన్నది. అయినప్పటికీ, ఆమె చాలా ఓర్పుతో మరియు దృఢమైన విశ్వాసంతో దానిని భరిస్తోంది. అల్లా ఆమెను త్వరితగతిన విడుదల చేసే మార్గాలను సృష్టించుగాకా!. అల్లా జమాత్ విషయంలో ప్రత్యర్థులకు ఉన్న అపోహలు మరియు దుష్ప్రవర్తనను తొలగించుగాకా!.

మీ దుఆలలో పాలస్తీనియన్లను గుర్తుంచుకోండి. స్పష్టంగా, గొప్ప మార్పులు అమలులో ఉన్నాయని వారు పేర్కొన్నారు. అయితే, పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసినప్పటికీ, దౌర్జన్యాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. పాశ్చాత్య శక్తుల ద్వంద్వ ప్రమాణాలు దీని నుండి స్పష్టంగా కనిపిస్తున్నాయి. తమ మిత్రదేశాలలో ఒకదానిపై ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడితే, వారు వెంటనే ప్రత్యర్థి వైపు ఆంక్షలు విధిస్తారు. అయితే, ఇజ్రాయెల్‌పై ఎలాంటి ఆంక్షలు విధించడం లేదు. దీనికి విరుద్ధంగా, అమెరికా ఇటీవల ఇజ్రాయెల్‌కు బిలియన్ డాలర్లను బేషరతు సహాయాన్ని ఆమోదించింది. అయితే, పాలస్తీనియన్ల కోసం, వారు కొన్ని మిలియన్ డాలర్ల సహాయాన్ని ఆమోదించారు, కానీ అదే సమయంలో, వారు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మాట్లాడే ఏ కోర్టు లేదా ఏ ఫోరమ్‌కు వెళ్లకూడదని షరతు పెట్టారు. కాబట్టి అలాంటి వ్యక్తుల నుండి ఏమి ఆశించగలము? దుఆ మాత్రమే ఉంది, ఈ అణచివేతదారుల నుండి అమాయకులను రక్షించుగాకా!. మనకు కూడ ఆ అమాయకుల కొరకు దుఆల హక్కును చెల్లించు భాగ్యమును కల్పించుగాకా!.

ఆమీన్.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ కోరినంత వరకు మీలో ప్రవక్తుత్వము స్థిరముగా నుండును. ఆ తర్వాత ప్రవక్తుత్వ పద్ధతిలో ఖిలాఫత్ (ఉత్తరాధికాధిత్వము) ఏర్పడును. అది ప్రవక్త అడుగుజాడలో కొనసాగును. దానికి స్వప్రయోజనములు యుండవు. అది ప్రవక్త కార్యమును ముందుకు కొనసాగించును. కాని కొంత కాలము తరువాత ఈ ఖిలాఫత్ అనగా పవిత్రమైన ఈ ఖిలాఫత్ అంతమగును. ఈ వరము మీతో లాక్కొనబడును. తర్వాత ప్రజలు ఇబ్బందిని ఎదుర్కొను రాజరికము ఏర్పడును. అనంతరం దానిని మించి బలవంతము చేయు రాజరికము ఏర్పడును. అనంతరం అల్లాహ్ కరుణ ఉప్పొంగును. ప్రవక్తుత్వ పద్ధతిన మరల ఖిలాఫత్ ఏర్పడును.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 6 పుట 285, ముస్నదున్నూమాన్ బిన్ బషీర్ హదీస్ 18596, ఆలముల్ కుతుబ్ బేరూత్ 1998)

ఇస్లాం చరిత్రలోని వివిధ కాలములలో జరిగిన ముస్లిం ప్రభుత్వ పాలకులు తమను తాము ఖులఫాలని పిలిపించుకొన్నట్లు మనము చూడవచ్చును. వారి స్థాయి ఖలీఫాల స్థాయి అని వారు చెప్పుకునేవారు. అయినను అధిక ముస్లిములు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తర్వాత గడిచిన నలుగురు ఖలీఫాలకే పవిత్ర ఖలీఫాల స్థానమిత్తురు. వీరి కాలమే పవిత్ర ఖిలాఫత్ కాలముగా పరిగణించబడును. అనగా ఆ కాలము మార్గదర్శనము గలదై, మార్గదర్శనము వ్యాపింపజేయు కాలముగా యుండెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విధముగా వ్యవస్థను నడిపించినట్లు చూచిరో అదే విధముగా నడిపించిరి. పవిత్ర ఖుర్ఆన్ బోధనల ప్రకారము నడిపించిరి. వంశపారంపర్య రాజరికము యుండక విశ్వాసుల జమాఅత్ ద్వారా వారికి ఖిలాఫత్ బాధ్యతను అల్లాహ్ తఆలా అప్పగించెను. వారు తప్ప ఇతర ఖలీఫాలు వంశపారంపర్య రాజరికమునే కొనసాగించుచుండిరి. ఇటుల ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి అక్షరాల పూర్తి అయినది. భవిష్యవాణిలో మొదటి రెండు విషయములు పూర్తి అయినపుడు వారు తెలిపిన తుది విషయములో కూడ మన యజమాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిన విధముగనే పూర్తి కావలసియుండెను. ఈ ప్రాపంచిక, ముస్లిముల చెడిపోయిన పరిస్థితులను చూచి, ప్రళయ దినము వరకు కొనసాగు శాసనముతో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను పంపిన అల్లాహ్ కరుణ ఉప్పొంగి, ప్రవక్తుత్వ విధానములో ఖిలాఫత్‌ను ఏర్పరచ వలసి యుండెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో చేసిన వాగ్దానము మేరకు అల్లాహ్ తాలా తన కరుణను ఉప్పొంగించెను, మన యజమాని, నాయకుని వాక్కును పూర్తి చేయుచు మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ ద్వారా ప్రవక్తుత్వ విధానములో ఖిలాఫత్‌ను ఏర్పరచెనని అహ్మదీయులైన మనము నమ్ముతాము. వారిని ఒక వైపు సమాజ ప్రవక్తగా అనుగ్రహించి మరో వైపు సర్వోత్తమ ఖలీఫాగా సత్కరించెను. తద్వారా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖిలాఫత్ పరంపర ఇక ముందు ప్రళయ దినము వరకు వారి సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు, సర్వోత్తమ ఖలీఫా ద్వారనే కొనసాగవలసి యుండెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తుత్వ విధానములో ఏర్పడు ఖిలాఫత్ గురించి గల ఈ భవిష్యవాణితో భాగము పొందుచున్నందున మనము అదృష్టవంతులము. జుమా అధ్యాములోని సూక్తి وَّاٰخَرِيۡنَ مِنۡهُمۡ لَمَّا يَلۡحَقُوۡا بِهِمۡ ؕ వివరణలో తర్వాత వచ్చే వారిని మొదటి వారితో కలిపిన వారిలో మనము యున్నాము. తమ చిరంజీవి విశ్వాసమును ఆకాశము నుండి భూమిపై తీసుకొచ్చునని (సహీ అల్ బుఖారి కితాబుత్తఫ్సీర్ సూరతుల్ జుమా బాబ్ ఖౌలుహు వఆఖరీన మిన్‌హుమ్ 4897) వారు చెప్పిన వ్యక్తిని నమ్మిన వారిలో మనందరిని చేర్పించెను. ఏ మసీహ్, మహ్దీకి సలాం అందించుమని వారు చెప్పినారో (ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 3 పుట 182, ముస్నద్ అబీహురైరహ్ హదీస్ 7957, ఆలముల్ కుతుబ్ బేరూత్ 1998) దాని ప్రకారము ఈ బాధ్యతను నెరవేర్చినవారిలో మనము యున్నాము. ఈ బాధ్యతను నిర్వర్తించువారిలో చేరుటకు అల్లాహ్ తఆలా మనలను అనుగ్రహించెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనంతరం ఏర్పడిన ఖిలాఫత్‌ను విశ్వసించే అహ్మదియ్యా జమాఅత్‌లో మనము చేరుట పూర్తిగా అల్లాహ్ అనుగ్రహమే.

కనుక అల్లాహ్ తఆలా ఈ అవతారున్ని నమ్మేవారికి తప్పనిసరి అయిన మార్పులను తమ స్థితులలో కల్పించుకొనుటను అల్లాహ్ తాలా ద్వారా కలిగిన ఈ శుభములన్నిటికి కృతజ్ఞతగా ఆశించును. అప్పుడే ఈ బైఅత్ హక్కును చెల్లించగలము. మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ విశ్వాసమును ఆకాశము


నుండి భూమిపై తీసుకరావలసియుండెను. తనను నమ్మేవారి హృదయాలను దానితో నింపవలసి యుండెను. వారీ కార్యమును నిశ్చయముగా చేసి చూపినారని ప్రతి అహ్మదీ ఇందుకు సాక్షి. కాని ఆ విశ్వాసమును స్థిరపరచుట వారి జీవితము వరకు మాత్రమే పరిమితము కాదు. లేదా కొన్ని దశాబ్దముల వరకు మాత్రమే పరిమితం కాదు. ప్రవక్తుత్వ విధానములో ఖిలాఫత్ ఏర్పడునని శుభవార్త అందించిన తరువాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మౌనము పాటించిరనగా ప్రళయ దినము వరకు విశ్వాసమును భూమిపై అద్భుతముగా, గొప్పగా స్థిరపరచవలసిన అవసరము గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్అలైహిస్సలాం బైఅత్‌లో తనను తాను చేర్చు ప్రతి అహ్మదీ ఈ విశ్వాసమును తమ హృదయములలో సదా స్థిరపరచుకొనుట కర్తవ్యము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత వారి పద్ధతిన కొనసాగుచున్న ఖిలాఫత్‌తో బంధము ఏర్పరచుకొని ఆ విశ్వాసమునకు ప్రతిరూపమై దానిని ప్రపంచ కోణములకు అందించుట నమ్మేవారి బాధ్యత. అందుకే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తాను ఈ ప్రపంచమును వీడు బాధాకరమైన వార్త జమాఅత్‌నకు అందించుచు ఇట్లు శుభవార్త కూడ అందించిరి. “వ్యితిరేకుల రెండు అసత్య సంతోషములను నిర్వీర్యము చేయుటకు ఆది నుండి రెండు శక్తులను చూపుట అల్లాహ్ తఆలా సాంప్రదాయము. ఇప్పుడు అల్లాహ్ తఆలా తన ప్రాచీన పద్ధతిని వీడుట అసాధ్యము”. ఇట్లనిరి. “కనుక మీరు ద్వితీయ శక్తిని కూడ చూడుట అనివార్యము. దాని రాక మీకు మేలు కలిగించును. ఎందుకనగా అది శాశ్వతమైనది. ప్రళయ దినము వరకు అది అంతము కాదు”.

(రిసాలా అల్‌వసియ్యత్ – రూహాని ఖజాయిన్ సంపుటి 20 పుట 305)

విశ్వాసమును భూమిపై స్థిరపరచుటకు అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత ఈ ద్వితీయ శక్తిని జారీ చేసెను. ధర్మము ప్రపంచము నుండి మరల అంతమైనదని వ్యతిరేకులు ఆనందపడుట అల్లాహ్ తఆలాకు ఇష్టము లేదు. షైతాన్ నిరాటంకంగా సంహరించుట అల్లాహ్ తఆలాకు ఇష్టము లేదు. అసత్య సంతోషములను అల్లాహ్ తఆలా రూపుమాపును. ఇందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత జారీ అయిన ఖిలాఫత్ వ్యవస్థ ద్వారా విశ్వాసమును స్థిరపరచును. ఈ విశ్వాసమును ప్రపంచములో స్థిరపరచుటకు ఖిలాఫత్ సహాయకులుగా ఈ వ్యవస్థతో ముడిపడియున్నామని ప్రకటించువారి బాధ్యత. మనము మన విశ్వాసమును కూడ రక్షించుకోవలెను, ఇతరులకు కూడ విశ్వాస కాంతిని స్పష్టము చేయాలని తమ బైఅత్ ప్రతిజ్ఞను దృష్టియందుంచుకొని దృఢమైన సంకల్పము చేయవలసిన అవసరమున్నది. తాను రెండు రెండు శక్తులను ప్రదర్శించుట అల్లాహ్ తఆలా ప్రాచీన సాంప్రదాయమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. ఈ ద్వితీయ శక్తి ఖిలాఫత్ వ్యవస్థ అని మనము బాగుగా ఎరుగుదుము. కనుక ఖిలాఫత్ వ్యవస్థకు ధార్మిక అభివృద్ధితో దృఢమైన సంబంధము గలదు. ఇది ఇస్లామీయ శాసనములో ఒక ముఖ్యమైన భాగము. ధార్మిక అభివృద్ధి ఖిలాఫత్ లేనిదే కానేకాదు. జమాఅత్ ఐక్యత ఖిలాఫత్ లేనిదే నిలువలేదు. ఖిలాఫత్‌తో సంబంధమున్న మనలోని ప్రతి ఒక్కరికి ఖిలాఫత్ కొనసాగుట విశ్వాసములోని భాగమను విషయము అల్లాహ్ తఆలా కృపానుసారము తెలుసు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు అన్‌హు పరమపదించినప్పుడు కుట్రను లేవనెత్తిన వారి మాటలను ఖండించినవారు కూడ ఈ విషయమును బాగుగా తెలిసియుండిరి. మనలో ఖిలాఫత్ వ్యవస్థ లేనిచో మన విశ్వాసము కొనసాగలేదని వారికి తెలిసియుండెను. అల్లాహ్‌కు కృతజ్ఞతలు ఎందుకనగా వారి త్యాగముల వలన, విశ్వాసములో వారికి గల దృఢత్వము వలన ఆ మహానుల సంతానమైన మనలోని అధికులు ఖిలాఫత్ వ్యవస్థతో ప్రయోజనము పొందుచున్నాము. ఈ విషయములో అందరి కంటే ఎక్కువ ప్రయత్నము, త్యాగము హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్‌హు చేసిరి. ఆరోపితులు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్‌హుపై పెద్ద పెద్ద ఆరోపణలు చేసినారు. ఖిలాఫత్ వ్యవస్థను రక్షించుటకు వారి హృదయములో గల స్థితికి ఒక ఉదాహరణను నేను హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) పదములలోనే మీకు తెలిపెదను. ఎందుకనగా ఇది కూడ చరిత్రలోని భాగము. పీడనముల నుండి దూరముండుటకు మనము చరిత్రను కూడ తిరగవేయవలెను. ఇదే విధముగా విశ్వాసము కూడ దృఢమగును.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇట్లనిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్‌అవ్వల్ (రజి) మృతి చెందిన గృహములోని ఆ గదికి నేను మౌల్వీ ముహమ్మద్ అలీ గారిని పిలిచి, ఇట్లన్నాను. ఖిలాఫత్ అవసరమా! అవసరము లేదా! అను విషయములో ఎలాంటి వివాదము చేయకండి. ఎవరి చేతిలో జమాఅత్‌నకు ప్రయోజనము కలుగును! ఇస్లాం ప్రగతి చెందును! అను విషయము వరకే మీ అభిప్రాయములను పరిమితం చేయగలరు. త్యాగము సమర్పించవలసిన విషయములలోనే సంధి ఏర్పడవచ్చును. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇట్లనిరి. నేను మౌల్వీ గారితో ఇట్లంటిని. వ్యక్తిగత భావముల విషయమునకు వచ్చినచో నేను నా భావములను మీ కొరకు త్యాగము చేయగలను. కాని నియమముల విషయము ఎదురైనచో తప్పదు. ఎందుకనగా నియమములను వీడుట ఎట్టి పరిస్థితిలో సబబు కాదు. మాకు, మీకు మధ్య గల భేదమేమనగా మేము ఖిలాఫత్‌ను ఒక ధార్మిక విషయముగా భావించుచు, అనివార్యమని విశ్వసింతుము. కాని మీరు ఖిలాఫత్‌ను అసమంజసమని అనలేరు ఎందుకనగా ఇప్పుడిప్పుడే మీకు ఒక ఖలీఫా బైఅత్ నుండి స్వాతంత్ర్యము లభించినది. అనగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్‌అవ్వల్ (రజి) బైఅత్ మీరు చేసియుండిరి. ఇప్పుడు వారు మృతి చెందిరి. ఇప్పుడు మీకు దానితో స్వాతంత్ర్యము లభించినది. మాకు ఖిలాఫత్ వద్దు, మేము ఖిలాఫత్ నుండి స్వాతంత్ర్యము పొందినారని మీరంటున్నారు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ వారితో ఇట్లనిరి. ఆరు సంవత్సరముల వరకు మీరు బైఅత్ చేసియున్నారు. ఆరు సంవత్సరముల వరకు ధర్మబద్ధమైన విషయము, తరువాత నిషేధము కాలేదు. అల్లాహ్ తాలా ఆజ్ఞతో యున్న విషయమును వీడలేము. మీ, మా పొజీషన్‌లో తేడా ఏమనగా మీరు మీ విషయమును వీడినచో ఇప్పటి వరకు ఆచరించిన దానినే మీరు ఆచరించవలసి వచ్చును. కాని మేము మా విషయమును వీడినచో అది మా విశ్వాసము, ధర్మమునకు వ్యతిరేకమగును. దానికి వ్యతిరేకంగా మేమెన్నడు ఆచరించలేదు. నేటి వరకు మీరు అనుసరించిన దారినే ఇప్పుడు కూడ అనుసరించుట న్యాయము. మమ్ములను మా ధర్మము, నియమమునకు విరుద్ధముగా చేయుటకు బలవంతము చేయకండి. హజ్రత్ మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇట్లనిరి. జమాఅత్ ప్రగతి, ఇస్లాం స్థాపన కొరకు ఎవరు మేలు అను ప్రశ్న ఇప్పుడు మిగిలియున్నది. మీరు ఏ వ్యక్తితో ఏకీభవింతురో ఆ వ్యక్తిని మేము ఖలీఫాగా అంగీకరింతుము. అల్లాహ్ తాలా కృపానుసారము జమఅత్‌లోని అధికులు ఖిలాఫత్ వ్యవస్థ ఏర్పడాలని కోరుచుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టమైన ఆదేశము జమాఅత్ ముందుండెను. ఈ సమావేశము ఎక్కువ పొడుగైనప్పుడు మౌల్వీ ముహమ్మద్ అలీ గారు మొండిగా వ్యవహరించుచు పోయిరి. ప్రజలు తలుపులను కొడ్డడం మొదలు పెట్టి త్వరగా నిర్ణయము తీసుకొని, మా బైఅత్ తీసుకోగలరని అనిరి. మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇంకా ఇట్లనిరి. నేను మీ సందేహములను దూరము చేసినాను, కనుక ఖలీఫా ఎవరను ప్రశ్న ఇప్పుడు మీ ముందుండవలెను తప్ప ఖలీఫా వుండాలా వద్దా అను ప్రశ్న కాదు. అందుకు మౌల్వీ గారిట్లనిరి. మీరెందుకు పట్టుబడుచున్నారో నాకు తెలుసు. ఖలీఫా ఎవరగుదురో మీకు తెలుసు. ఎవరగుదురో నాకు తెలియదని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) సమాధానమిచ్చిరి. మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇంకా ఇట్లనిరి. మీరు ఎన్నుకొనిన వ్యక్తిపై నేను బైఅత్ చేయుదును. ఖిలాఫత్‌ను ఆశించే ప్రజలు నా మాట వింటున్నారు. కనుక వ్యతిరేకత ఎదురయ్యే ప్రశ్నే లేదు. కాని మౌల్వీ గారు నమ్ముటకు సిద్ధముగా లేకుండిరి. అందుకే నమ్మలేదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు ఇంకా ఇట్లనిరి. నేను వారితో ఇట్లంటిని. మీరు నా గురించి చేయుచున్న అనుమానముల గురించి నేను మీకు నా హృదయము ఎట్లు చీల్చి చూపించగలను.



ఏ త్యాగము నేను చేయగలనో దానికి నేను సిద్ధముగా యున్నాను. కొంత సమయము తరువాత ద్వారము తెరువబడెను. వారు బయటికి వచ్చారు. (తదుపరి సంచికలో) మసీహిస్సాని హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ (రజి) గారి పేరును సూచించిరి. మీరు బైఅత్ తీసుకోగలరని జమాఅత్ బలవంతము చేసెను. నాకు బైఅత్ పదములు కూడ గుర్తు లేవని వారనిరి. బహుశా మౌల్వీ సర్వర్ అహ్మద్ షాహ్ గారు నేను చదివింతుననిరి. అల్లాహ్ తాలా తమ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాటను పూర్తి చేయుచు ద్వితీయ శక్తి కొనసాగుటలో కుట్రలు పన్నుటకు కృషి చేసిన వారి కుట్రలను విఫలము చేసెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మృతి తరువాత రెండవ సారి ప్రవక్తృత్వ విధానములో ఖిలాఫత్‌ను మరల స్థాపించెను. ఖిలాఫత్ నుండి దూరమైన వ్యక్తులు కూడ ధార్మిక, ప్రాపంచిక గొప్ప విద్యావంతులై యుండిరి. విద్యావంతులే కాక, అనుభవజ్ఞులై, ధనవంతులు, గొప్ప స్థాయి కలిగిన వారై యండిరి. అంజుమన్ సంపదను తమ అధీనములో చేసుకొని యుండిరి. అయినను వారు వరుసగా విఫలమైనారు. ద్వితీయ ఖిలాఫత్ ఎన్నుకోబడిన తరువాత మౌల్వీ గారు అక్కడి నుండి, ఖాదియాన్‌ను విడీ పోయిరి. ఈ తిరస్కృతులు ఖిలాఫత్ వ్యవస్థను అంతము చేసిన తరువాత కూడ పెద్ద పెద్ద కుట్రలు పన్నినారు. అయినను సదా విఫలమునే చవి చూసినారు. ఎందుకు? ఎందుకనగా ఖిలాఫత్‌ను కొనసాగింతునని అల్లాహ్ తాలా వాగ్దానము చేసియుండెను. వీరు అన్ని విధాలా విఫలమై, ఖాదియాన్ ను వీడి పోవుచున్నప్పుడు, ఖజానాను ఖాళీ చేసిరి. వెళ్లేటప్పుడు తాలీముల్ ఇస్లాం భవనము వైపు సంజ్ఞ చేయుచు పది సం॥ల లోపు ఈ భవనములను ఆర్యులు, క్రైస్తవులు ఆక్రమించుకొందురని అనిరి.

*(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 18 పుట 72-75)*

కాని అల్లాహ్ తాలా ఎంత గొప్పగా తన వాగ్దానమును పూర్తి చేయునో చూడగలరు. ఏ విధముగా తన రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లం మాటను పూర్తి చేయును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా అందించిన శుభవార్తను పూర్తి చేయడమే కాక నేటికి క్రొత్త రీతిలో పూర్తి చేయుచున్నాడు. ఆ పది సం॥లు గడిచినవి, తరువాత అనేక దశాబ్దములు కూడ గడిచినవి. నేటికి 101 సంవత్సరములు గడిచినవి. అతి కఠిన పరిస్థితులలో కూడ ఖాదియాన్ ప్రగతి చెందుచున్నది. ఇందులో దేశ విభజన కూడ యున్నది. అప్పుడు జమాఅత్ అక్కడి నుండి వెళ్లవలసివచ్చెను. త్యాగపూరిత జీవితము గడుపుటకు అక్కడ కొన్ని వందల వ్యక్తులను మాత్రమే వదలవలసివచ్చెను. ఇప్పుడైతే ఖాదియాన్‌లో క్రొత్త క్రొత్త ఆధునిక భవనములు నిర్మించబడుచున్నవి. ఒక్క పాఠశాలను ఆక్రమించుట గురించి మాట్లాడుచుండిరి. కొన్ని కోట్ల పెట్టుబడితో క్రొత్త పాఠశాలలు నిర్మించబడుచున్నవి. అల్లాహ్ తాలా కృపానుసారము అక్కడ ప్రచార కార్యక్రమములు కూడ చాలా విస్తరించినవి. ఖాదియాన్‌లో కాక ప్రపంచములోని ఇతర అనేక దేశములలో అహ్మదియ్య ఖిలాఫత్‌తో ముడిపడియున్న జమాఅత్ అనేక అంతస్తుల భవనములు అల్లాహ్ తాలా సహాయ, సహాకారమునకు నిదర్శనముగా నిలుచుచున్నవి. ప్రపంచములోని ప్రతి మతస్తునికి ఇస్లాం అందమైన సందేశము అందుచున్నది. అహ్మదియ్య ఖిలాఫత్‌తో గల దైవ సహాయ సన్నివేశములను మనము ప్రతి రోజు తిలకించుచున్నాము.

అహ్మదియ్య ఖిలాఫత్‌తో ముడిపడియున్న వారికి అల్లాహ్ అందించుచున్న శుభములతో జర్మనీ కూడ ఖాళీగా లేదు. ఇప్పుడే కొద్ది రోజుల క్రితం జర్మనీలోని రెండు ఉపశాఖలు అన్సారుల్లాహ్, లజ్నా ఇమాయిల్లాహ్ సంయుక్తముగా ఐదు అంతస్తుల ఒక భవనము కొనుగోలు చేసెను. 1.7 మిలియన్ లేదా 17 లక్షల యూరోలతో కొనుగోలు చేయనైనది. ఖిలాఫత్ వ్యతిరేకులు ఒక్క రూపాయి కంటే తక్కువ నగదును వదిలి, ఇప్పుడు ఈ వ్యవస్థ ఎలా కొనసాగునని హాస్యించిరి. ఆ ఖిలాఫత్‌తో సంబంధము గల ఒక దేశ రెండు ఉపశాఖలు ఒక విశాలమైన ఐదు అంతస్తుల భవనమును 19 కోట్ల రోపాయల వ్యవయముతో కొనుగోలు చేసెను. ఇప్పుడిది అల్లాహ్ అనుగ్రహము, అహ్మదియ్య ఖిలాఫత్ సహాయము కాక మరేమిటి ? ఖిలాఫత్‌తో విడిపోయిన వారి కేంద్ర వ్యవస్థ కూడ చిన్నాభిన్నమైనది. వారిలో గల సత్యస్వభావికులు లేదా వారి సంతానమునకు పశ్చాత్తాపము కలిగినప్పుడు నేడు కూడ వారిలో నుండి కొందరు బైఅత్ చేసిన అహ్మదియ్య జమాఅత్‌లో ప్రవేశించి, ఖిలాఫత్ పతాకము నీడన చేరుచున్నారు.

నేడు ఇస్లాం ప్రచార కార్యము అహ్మదియ్య ఖిలాఫత్ వ్యవస్థ ఆధ్వర్యములోనే అగుచున్నది. ప్రపంచములో ఇస్లాంను అపనిందకు గురిచేయుచున్నప్పుడు ఇస్లాం అందమైన చిత్రమును అహ్మదియ్య జమాఅతే ప్రదర్శించుచున్నది. అందుకే అల్లాహ్ తాలా స్వయంగా అహ్మదియ్య ఖిలాఫత్ సత్యమును ప్రపంచముపై నిరూపించుచున్నాడు. అల్లాహ్ ఏ విధముగా జమాఅత్ సత్యముతో పాటు ఖిలాఫత్‌నకు సహకరించునో తెలుపు కొన్ని సంఘటనలు చాలా ఆశ్చర్యకరముగా యుండును. అహ్మదియ్య జమాఅత్ సత్యమునే కాక ఖిలాఫత్‌తో సహాయ, సహకారమును కూడ అల్లాహ్ చూపుచున్నాడు. ఇతరులకు చూపుచు, సత్యస్వభావము గల వ్యక్తుల సందేహములను నివృత్తి చేయుచున్నాడు. ఒకటి రెండు సంఘటనలను నేనిక్కడ ప్రస్తావింతును.

ఆఫ్రీకాలో ఒక దేశము నైజేరియా గలదు. అక్కడి మన ముబల్లిఘ్ ఇట్లు వ్రాసిరి. క్రొత్తగా చేరినవారి శిక్షణ శిబిరంలో పది మంది ఇమాములతో పాటు ఒక వుగ్గా గ్రామ సర్పంచి కూడ హాజరైరి. ఈ శిక్షణ తరగతి ఇమామ్‌ల కొరకు నిర్వహించబడినది. ఇమామ్ బదులు మీరు స్వయముగా ఎందుకొచ్చినారని వారిని ప్రశ్నించగా వారిట్లనిరి. ఇది ఇమాముల తరగతి అని నాకు తెలుసు. కాని నిన్న రాత్రి తరగతిలో పాల్గొనవలెనని నేను ఇమామ్‌నకు సందేశము పంపగా తరగతిలో పాల్గొనుటకు అతడు నిరాకరించి, ఇట్లనెను. నగరములోని వహాబీలైన సున్నీ ఉలమాలు అహ్మదీయులు అవిశ్వాసులని నాకు చెప్పినారు. కనుక అహ్మదీయులు ఎలా అవిశ్వాసులగుదురని నాకు చాలా ఆశ్చర్యము కలుగడమే కాక తీవ్ర బాధ కలిగినది. అహ్మదీయులు అవిశ్వాసులైనచో సర్పంచిగా ప్రచారము చేయు అనుమతి వారికి నేనిచ్చినాను. కనుక నేను రెట్టింపు అవిశ్వాసుడనైతిని. అందుకే నేను రాత్రికి చాలా దుఆ చేసితిని. ఆఫ్రీకా వాసులు నిరక్షరాస్యులు, అవివేకులని కొందరందురు. గ్రామములో యుంటున్న ఈ సర్పంచి కూడ ఎక్కువ చదువుకోలేదు కావచ్చును. కాని అల్లాహ్ తాలా భయముండెను, సత్యస్వభావికులై యుండిరి. వారిట్లనిరి. నేను రాత్రి చాలా దుఆ చేయుచు అల్లాహ్‌తో మార్గదర్శనము కోరుచు నిద్రకు ఉపక్రమించితిని. రాత్రి నేను స్వప్నములో ఇట్లు చూచితిని. మొదట నా గృహములో ఆకాశము నుండి నక్షత్రములు దిగినవి. అనంతరం వాటి వెనుకనే చంద్రుడు. నేను వాటిని సమీపము నుండి చూచుచున్నాను. కాని వాటిలో కాంతి లేదు. అనంతరం అకస్మాత్తుగా ఆకాశము నుండి తెల్లటి దుస్తులు ధరించిన ఒక వ్యక్తి నా గృహములో దిగెను. గృహములో వారు దిగగానే నక్షత్రములు, చంద్రుడు అన్ని కాంతివంతమయ్యెను. గృహము మొత్తం కాంతులతో ప్రకాశించడం మొదలయ్యెను. వీరు అహ్మదీయులకు చెందిన వ్యక్తి అని నా హృదయములో గట్టిగా ఆలోచన కలిగెను. నేను ముందుకు వెళ్లి మీరు అహ్మదీయుల శిక్షకులా! ఖలీఫానా! అని అడిగితిని. ఇంతలోనే నేను నిద్ర లేచితిని. మురబ్బి గారు వారికి ఫోటోలను చూపించిరి. అల్బమ్ చూపగా నా ఫోటోపై తమ వ్రేలు పెట్టి పదే పదే ప్రమాణము చేయుచు ఆకాశము నుండి దిగుచున్నట్లు నేను వీరినే చూచినాను. వీరి రాకతోనే నా గృహము కాంతివంతమైనదని అనిరి.

గేంబియా అమీర్ (అధ్యక్షులు) ఇట్లు వ్రాసిరి. ఒక గ్రామము సాంబా బాయిన్ లో సందేశము అందించబడెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆగమనము గురించి వారికి చెప్పి, జమాఅత్‌లో ప్రవేశించుటకు గల బైఅత్ నిబంధనలను వారికి వినిపించబడెను. అప్పుడు గ్రామ ఇమామ్, గ్రామ అభివృద్ధి కమిటి చైర్మన్ నిస్సంకోచముగా ఇట్లనిరి. ఇమామ్ మహ్దీ అవతరణ గురించి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి చేసిరి. నేడు మొదటి సారి ఇమామ్ మహ్దీ అగమనము గురించి వారు వింటున్నారు. అహ్మదియ్యత్‌ను చూచినపుటి నుండి చాలా ప్రభావితమైనారు. మరల ఇట్లనిరి. అహ్మదీయులు మాత్రమే నిజమైన ముస్లిములు. ఎందుకనగా వారి వద్ద ఖిలాఫత్ శక్తి గలదు. అది అందరిని ఒకే హారములో పొదిగెను. వారికి నా గురించి చెప్పబడినప్పుడు, చిత్రము చూపబడినప్పుడు మేము వీరిని రోజు చూస్తాము, ఈ వ్యక్తిని ప్రతి రోజు టి.వి.లో చూస్తాను. అనంతరం సుమారు 350 మంది మొత్తం బైఅత్ చేసి అహ్మదియ్య జమాఅత్‌లో ప్రవేశించిరి. పవిత్ర ఖుర్‌ఆన్ అనువాదమును 3 భాషలలో వారు చూచినప్పుడు అహ్మదియ్యతే నిజమైన ఇస్లాం అని అనిరి. అహ్మదీయులు చేయునట్లు ఏ వర్గమునకు అనుగ్రహము లభించడం లేదు. నిజమైన ఇస్లాం ఇదే, ఇతర మౌల్వీలు మమ్ములను మోసము చేయుచున్నారని తెలుపుచు తాము అహ్మదియ్యత్‌లో స్థిరముగా యుందుము, వెనుకడుగు వేయమని చివరలో అనిరి.

ఇప్పుడు ఇదే ప్రయాణములో ఆఖిన్ మస్జిద్ ప్రారంభోత్సవము సందర్భమున, హనావ్ మస్జిద్ ప్రారంభోత్సవము సందర్భమున వివిధ తరగతులకు చెందిన ప్రాంతీయ ప్రజలుండిరి. రాజకీయవేత్తలు కూడ యుండిరి, వ్యాపారులు కూడ యుండిరి, ఉపాధ్యాయులు, ఇతర విద్యావేత్తలు కూడ యుండిరి. స్త్రీ, పురుషులు కూడ యుండిరి. వీరిలో అనేకులు తమ అభిప్రాయములను వ్యక్తపరచిరి. ఒకరిట్లనిరి.

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 8. Thursday, 15 AUG 2024 Issue No. 33.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

అనేక అహ్మదీయులతో నాకు పరిచయం గలదు. ఈ పరిచయం వలన నాకు చాలా వరకు తెలుసని నేను భావించేవాడిని. కాని చెప్పిన వారికి వారిట్లు తెలిపిరి. మీ ఖలీఫా మాటలను విన్న తరువాత ఇంతకు ముందెన్నడు లేని విధముగా నేను ప్రభావితమైతిని. ఇస్లాం గురించి వాస్తవము నాకిప్పుడు సరియైన రీతిలో తెలిసినది. అది హృదయములో దిగెను. ఖిలాఫత్‌తో ముడిపడియున్నందు వల్లనే అల్లాహ్ తాలా శుభములివి.

నేనొక సాధారణ వ్యక్తిని. నా స్థితి గురించి నాకు తెలుసు. నా విశిష్టత ఏమియును లేదు. కాని అల్లాహ్ తాలా ఖిలాఫత్‌ను బలపరచునని, సహకరించునని వాగ్దానము చేసెను. నిశ్చయముగా అల్లాహ్ తాలా నిజమైన వాగ్దానముల వాడు. అతడు సదా ఖిలాఫత్‌ను బలపరచుచు, సహకరించెను. మున్ముందు కూడ చేయుచుండును. ఇన్షాఅల్లాహ్.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కూడ ఇట్లనిరి. ఈ ద్వితీయ శక్తిని అల్లాహ్ స్థాపించెను. దీని బహిర్గత దృశ్యములను మనము చూచుచున్నాము. తమ విశ్వాసములో గట్టిగా యున్నవారు సంకేతములను, సహాయములను చూచుచుందురు. కావున తమ విశ్వాసలమును దృఢపరచుము. అహ్మదియ్య ఖిలాఫత్‌తో తమ బంధమును ఏర్పరచుకొని, ఖిలాఫత్ వరమును పొందువారితో అల్లాహ్ వాగ్దానము చేసిన హక్కును చెల్లించుము. ఇస్లాం మొదటి కాలములో ప్రాపంచికము అధికమైనందున ఖిలాఫత్ వరము వెనక్కి తీసుకోబడెను. ఇప్పుడు ఇన్షాఅల్లాహ్ ఈ శుభమును అల్లాహ్ తాలా కొనసాగించును. కాని ప్రపంచముపై ధర్మమునకు ప్రాధాన్యతనిత్తుమను వాగ్దానమును పూర్తి చేయనివారు దీని నుండి దూరముందురు. ఈ నియమములను పాటించనిచో ఖిలాఫత్ బహుమానముతో అల్లాహ్ తాలా పెట్టిన బహుమానముతో దూరముందురు. ఖిలాఫత్ ద్వారా భయమును శాంతితో మార్చునని అల్లాహ్ వాగ్దానము చేసెను. కాని అల్లాహ్ హక్కును చెల్లించేవారితో వాగ్దానము చేసెను. మొదటి హక్కు - يَعْبُدُوْنَنِيْ నన్ను ఆరాధింతురు. కనుక ఈ వరముతో లబ్ది పొందగోరినచో అల్లాహ్ ఆరాధన హక్కును చెల్లించుము. తమ ఐదు పూటల నమాజుల హక్కులను చెల్లించుము. గొప్ప రీతిలో చెల్లించు వైపు దృష్టి సారించుము. మరల ఇట్లనెను. - لَا يُشْرِكُوْنَ بِيْ شَيْئًا ط దేనిని నాకు భాగస్వామిగా చేయరు.

ఈ ప్రపంచములో ఒక వైపు మానవుని వివిధ ప్రాధాన్యతాంశములు గలవు, ఈ అభివృద్ధి చెందిన దేశములలో ప్రత్యేకముగా ఇహలోక పరుగు ఏర్పడినది. ఈ ఇహలోక వస్తువులకు కొందరు అల్లాహ్ తాలా కంటే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం మొదలు పెట్టిరి లేదా ఇచ్చుచున్నారు. ఇహలోక లబ్ది పొందుటకు తప్పుడు, అసత్యముతో సహాకారము తీసుకుంటున్నారు. ఇది కూడ ఒక రకమైన అన్యారాధనే. ఇటువంటి వ్యక్తులు ఖిలాఫత్ నుండి సరిగ్గా ప్రయోజనము పొందలేరు. ప్రచారము పొందుచున్న ఒక మిత్రుడు ఇక్కడ జర్మనీ నుండి ఉత్తరం వ్రాసెను. అతడు అన్ని విషయములతో పాటు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమును ఒప్పుకున్నాడు, బైఅత్ చేసి తమ జమాఅత్‌లో చేరమని ఆ వ్యక్తి తన మిత్రునితో అన్నప్పుడు అతడిట్లనెను. నాకు అహ్మదీయులు తెలుసు. నా చుట్టు ప్రక్కల యున్న, నా సన్నిహితులైన కొందరు పన్ను దొంగలింతురు, అబద్ధమాడుదురు, ఇతర తప్పుడు పనులలో కూడ నిమగ్నమైయున్నారు. కాని నేను ఈ తప్పుడు పనులన్నిటిని చేయను. నేను పన్ను కూడ పూర్తిగా చెల్లింతును, ట్యాక్సి నడిపినచో దాని డబ్బులు కూడ మొత్తం చెల్లింతును. కనుక నేనెట్లు వారిలో చేరను. నేను వారి కంటే ఉత్తముడను. మీ విశ్వాసములను నేను విశ్వసింతును. ఇతని ఈ సమాధానము సరికాదు. అల్లాహ్ తాలా అతని ప్రవక్త ఆదేశమును నమ్మనందున ఇతడు స్వయముగా నిందుతుడైనాడు. మీ ముందు వాస్తవము వచ్చినను కొందరు వ్యక్తులను చూచి దానినెందుకు నిరాకరింతిరి. నీకివ్వబడిన నా ఆజ్ఞను ఎందుకు నమ్మలేదని అల్లాహ్ అనును. కాని ఇటువంటి అహ్మదీయులు తమ తప్పుడు పద్ధతుల వలన రెట్టింపు పాపమునకు పాల్పడుచున్నారు. తాము కూడ అల్లాహ్ తాలా శుభములతో దూరముందురు, దూరముంటున్నారు, ఇతరులను కూడ దూరము చేయుచున్నారు. ఇటువంటి వ్యక్తుల గురించి వీరు మావారనిపించుకొని మమ్ములను అపనిందకు గురి చేయువారని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను అపనిందకు గురిచేసే వ్యక్తులు వారు జారీ చేసిన ఖిలాఫత్ ప్రయోజనము నుండి ఎలా భాగము పొందగలరు. కనుక ఇటువంటి వ్యక్తులు తమ ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. ఇదే విధముగా మీ పనులలో యున్న శుభము లేదా అల్లాహ్ తాలా మీకు పని చేయుటకు అనుగ్రహించుచున్నది ఖిలాఫత్‌తో మడిపడియున్నందుకేనని నేను పనిచేయువారికి, హోదాదారులకు కూడ చెప్పదలచితిని. దీని నుండి విడిపోయి ఎవరు కూడ దమ్మిడి పని చేయలేరు. కొన్ని పనుల మంచి ఫలితాలను ప్రపాంచిక విద్య, వివేకము, ప్రయతము వలన అని ఎవరైనా భావించినచో ఇది అతని ఊహ మాత్రమేనని గమనించవలెను. ధర్మము పేరున చేయబడు పని ఖిలాఫత్ నుండి దూరమై చేసినచో ఇసుమంత కూడ శుభము కలుగదు. విడిపోయిన వారు ఫలితము చవిచూసినారని నేనింతకు ముందే చెప్పినాను. ప్రతి రోజు వారి సంఖ్య తగ్గుచున్నది. వారి కేంద్రీకము అంతమగుచున్నది. వారి వ్యవస్థ నిర్జీవమైపోతున్నది. ఖిలాఫత్‌లో గల ప్రేమ, విధేయత ఈ అల్లాహ్ శుభములను ఆకర్షించుచున్నది, మంచి ఫలితములు వెలువడుచ్నునవి. ఇది అల్లాహ్ స్థాపించిన వ్యవస్థ అయినందున ధార్మిక ప్రగతి కొరకు ప్రతి కృషిని ఖిలాఫత్‌తో జోడించెను.

ఎవరేని పదవిదారునిలో గర్వము, అహంకారము వచ్చినచో అతడు క్షమాపణ వైపు దృష్టి సారించవలెను. అహ్మదియ్య జమాఅత్ అభివృద్ధిలో ఉలమాల విద్య పని చేయడం లేదు, వివేకుల వివేకము పని చేయడం లేదు, ప్రాపంచిక విద్యావంతుల విద్య, నైపుణ్యము పని చేయడం లేదు. ధార్మిక విద్య కలిగిన, వివేకుని వివేకము, ప్రాపంచిక విద్యావంతుని విద్య, నిపుణుల నైపుణ్యము జమాఅత్ కార్యములలో అసాధారణ ఫలితములకు కారణమైనచో అది కేవలము అల్లాహ్ అనుగ్రహము, ఖిలాఫత్‌తో సంబంధము కలిగియున్నందుకే అగుచున్నది. ఈ సంబంధము కలిగియున్నవారితో ఆ ఫలితముల గూర్చి అల్లాహ్ వాగ్దానము కలదు, అందుకే అతడు అనుగ్రహించుచున్నాడు. ప్రాపంచికులలో, ప్రాపంచికములో నిస్సందేహముగా విద్య, వివేకము, నైపుణ్యము పనికి వచ్చును. కాని జమాఅత్‌లో యున్నవారు ప్రత్యేకముగా జమాఅత్ కార్యములలో ఉత్తమ ఫలితముల కొరకు తమను తాము ఖిలాఫత్ విధేయులుగా చేసుకోవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను క్రొత్తగా విశ్వసించిన నవయువకులు, పిల్లలు, సరియైన అవగాహన లేని వారిని ఖిలాఫత్‌తో మంచి సంబంధము ఏర్పరచి, వారికి సరియైన విషయము తెలుపుట విద్యావంతుల బాధ్యత. ఇదే విధముగా పదవిదారులు కూడ బాధ్యులే. కొందరు హోదాదారులు ఎన్నికై హోదాలు పొందుదురు కాని ధర్మము గురించి ఏమాత్రం అవగాహన యుండదు. వారు తమ పదవిని కూడ ప్రాపంచిక పదవిగా భావింతురు. నా దగ్గర ఫలానా పదవి యున్నదని నా ముందు కొందరు అన్నప్పుడు సదా వారిని నేనిట్లందును. పదవి అనకుము, సేవ అనుము, ధార్మిక సేవ చేయు అనుగ్రహము అల్లాహ్ కలిగించినచో ధార్మిక విద్యను కూడ పెంచుకొనుటకు ప్రయత్నించుము. తమ విధేయత, విశ్వసనీయతను పెంచుము. తమ నిస్టాపరతను కూడ పెంచుకొనుము. ఖిలాఫత్‌తో తమ బంధమును కూడ పెంచుము. మేము హోదాదారులమని తమ ప్రాముఖ్యత గురించి చెప్పే హోదాదారులు కూడ యున్నారు. కాని సం॥లో ఒక సారి ఖిలాఫత్ దినోత్సవము నిర్వహించి మేము కర్తవ్యమును పూర్తి చేసినామని భావింతురు. నేనింతకు ముందు కూడ హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు సూచన ద్వారా ఖిలాఫత్‌తో సంబంధము కలగియుండాలని ఎంత శ్రద్ధ చూపాలో అంత చూపరని చెప్పియుంటిని. ఇప్పుడు నేను చెప్పిన తరువాత సభలలో ఉపన్యాసములైతే మొదలైనవి. కాని వర్తమాన ఖలీఫా ప్రవచనములను వినుము. వాటిని ఆచరించుటకు కృషి చేయుము. ఖిలాఫత్‌తో తమ బంధమును పెంచుమను విషయమును గట్టిగా సూచించవలసిన అవసరమున్నది.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz